
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

బుధవారం 18 డిసెంబరు 2024



5

స్నాతకోత్సాహం



మంగళగిరి, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థుల కేరింతలు.. వారి కుటుంబసభ్యులు, తల్లిదండ్రుల ఆనందోత్సాహాలు.. అతిరథులకు స్వాగత సత్కారాల మధ్య మంగళవారం మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాధారణంగా స్నాతకోత్సవాలకు గవర్నర్ చాన్సలర్ హోదాలో పాల్గొంటారు. అయితే ఏకంగా రాష్ట్రపతి హాజరుకావడంతో ఈ వేడుకకు విశేషమైన ప్రాధాన్యం ఏర్పడింది. ఎయిమ్స్ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి జేపీ నడ్డా హాజరు కావాల్సి ఉండగా ఆ స్థానంలో ఆ బాధ్యతలను కేంద్ర ఆయుష్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావుజాదవ్ నిర్వర్తించారు. జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఓవరాల్ అకడమిక్ టాపర్‌గా కేరళకు చెందిన లియా అజీ, బెస్ట్ మేల్ టాపర్‌గా ఏపీకి చెందిన దాసరి దివ్యాంశ్, బెస్ట్ ఫీమేల్ టాపర్‌గా పంజాబ్‌కు చెందిన సుప్రభసింహ్, బెస్ట్ ఇంటర్న్‌షిప్‌గా కేరళకు చెందిన వీకే అధీరా ప్రభృతులు బంగారు పతకాలను అందుకున్నారు. 47 మంది ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు, మరో నలుగురు పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్‌జాదవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో కలిసి

(మిగతా 8వ పేజీలో)



వేడుకకు హాజరైన వైద్య విద్యార్థులు, కుటుంబసభ్యులు

- సంబరంగా ఎయిమ్స్ స్నాతకోత్సవం
- విద్యార్థులకు పట్టాలు అందజేసిన రాష్ట్రపతి
- మహిళా వైద్యుల శాతంపై ద్రౌపదిముర్ము హర్షం
- వైద్యులు చిత్తశుద్ధితో సేవకు ప్రాధాన్యమివ్వాలన్న రాష్ట్రపతి
- కేంద్ర సహాయమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో వేడుక
- ఎయిమ్స్‌లో ఇకపై మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వం: చంద్రబాబు



స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రకాష్‌రావు జాదవ్, లోకేశ్, సత్యకుమార్ యాదవ్



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న సీఎస్ నీరబ్‌కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, కలెక్టర్ నాగలక్ష్మి



అభిషేకాల అనంతరం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకారం

త్రికోటేశ్వరునికి మహారుద్రాభిషేకం

❖ జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు

పాతగుంటూరు శివార్లలో యువకుడి హత్య

- డబ్బు విషయమై మద్యం మత్తులో దాడి
- పరారీలో ఐదుగురు నిందితులు

6

స్వల్ప వివాదం.. ఆగిన వివాహం

- తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కూతురుతో ఓ ఐపీఎస్‌కు వివాహం నిశ్చయం
- కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్లాలన్న పెళ్లి కుమార్తె తరపు బంధువులు
- ససేమిరా అన్న వరుడు
- నిలిచిన పెళ్లి .. రంగంలోకి కాంగ్రెస్ నేతలు
- అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉన్న చర్చలు

8

పథకం ప్రకారమే చంపేసింది!

- సహకరించిన ప్రియుడు, నలుగురు మైనర్లు
- అన్నదమ్ముల హత్య కేసులో చెల్లిసహా ఆరుగురి అరెస్టు

3

వరికోతలు వద్దు

- జిల్లాకు భారీ వర్ష సూచన
- అప్రమత్తంగా ఉండాలన్న జేసీ భార్గవతేజ
- టార్పాలిన్ పట్టాల కోసం కాల్ సెంటర్ ఏర్పాటు
- మంగళవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో చినుకులు



గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వాతావరణశాఖ జిల్లాకు భారీ వర్ష సూచన జారీ చేసింది. మంగవాళరం రోజంతా ఆకాశం మేఘావృతమైంది. చల్లటి గాలులతో ప్రజలు వణికిపోయారు. రాత్రికి గుంటూరు సహా పలు ప్రాంతాల్లో వర్షపు చినుకులు పడ్డాయి. వర్షం హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ భార్గవతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వీలైనంత వరకు పంటను కోత కోయకుండా వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన పంటను సురక్షిత స్థలంలో ఉంచాలని, వీలైనంత వరకు ఎత్తైన ప్రదేశంలో ఉంచేలా చూసుకోవాలన్నారు. వర్షం నీరు చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని నాణ్యతని కాపాడుకోవాలి. కోసిన పంటపై టార్పాలిన్ పట్టా కప్పి సురక్షితంగా ఉంచాలి. రైతులకు టార్పాలిన్ పట్టాలు అవసరమైతే 9989522621, 9849924429 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్ నంబరు 9491392717ని కూడా సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

9013.52 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో 95 రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 9013.520 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ భార్గవతేజ తెలిపారు. ఇప్పటివరకు 1370 మంది రైతులు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో విక్రయించుకున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికే రూ. 20.45 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. గోనె సంచులు, హమాలీల చార్జీలకు రూ.20.25 లక్షలు చెల్లించిందన్నారు. రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని కనీస మద్దతు ధరకి రైతు సేవా కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. మొత్తం 18 మండలాల్లోని 156 రైతు సేవా కేంద్రాలను 45 క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఎవరూ దళారుల బారిన పడి మోసపోవద్దని సూచించారు.

23 బార్లకు నోటిఫికేషన్

- ఖాళీగా ఉన్న వాటికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 22 వరకు దరఖాస్తు.. 24న ఈ-వేలం
- గుంటూరులో ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు రూ.15 లక్షల ఫీజు



గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి వైన్స్‌కు ఇటీవల అనుమతించింది. కాగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 23 బార్లు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఆ 23 బార్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. వీటితో పాటు గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు కూడా నోటిఫికేషన్ జారీ చేసింది. బార్లకు ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. 23న ఆయా దరఖాస్తుల పరిశీలన 24న ఈ-ఆక్షన్ జరుగుతుందని అధికారులు తెలిపారు. ఒక్కో బార్‌కు ఈ-వేలం రెండు విడతల్లో జరుగుతుందని, ఉదయం వేలానికి ఎవరూ రాకపోతే ఆ బార్‌కు మధ్యాహ్నం నిర్వహిస్తామన్నారు. గుంటూరులో ఏర్పాటు చేసే ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

దరఖాస్తు ఫీజులు ఇలా..

మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో-1, తెనాలి-5, పొన్నూరు-2, రేపల్లె-1, పిడుగురాళ్ల-6, మాచర్ల-3, గురజాల-2, దాచేపల్లిలో-3 చొప్పున బార్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. మంగళగిరి తాడేపల్లి పరిధిలో ఒక షాపునకు రూ.10 లక్షలు నాన్ రీఫండబుల్ ఫీజు చెల్లించాలి. గురజాల, దాచేపల్లి షాపులకు రూ.5 లక్షలు, తెనాలి, పొన్నూరు, రేపల్లె, పిడుగురాళ్ల, మాచర్లలోని బార్లకు ఫీజు రూ.7.5 లక్షలు చొప్పున ఫీజుగా నిర్ణయించారు. ఐదేళ్ల కాలపరి మితిలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌కు రూ.15 లక్షలు ఫీజు నిర్ణయించినట్లు గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.

డీసీలు ఏకగ్రీవం

- 21న ప్రాజెక్టు కమిటీ ఎన్నిక

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు ఏకాభిప్రాయంతో ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 22 డీసీలుండగా అన్నీ ఏకగ్రీవం అయ్యాయి. మంగళవారం ఎన్నికల అధికారుల సమక్షంలో వాటర్ యూజర్ అసోసియేషన్స్(డబ్ల్యూయూఏ)లకు ఎన్నికైన సభ్యులు డీసీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకొన్నారు. కేడబ్ల్యూడీ పరిధిలో దుగ్గిరాల డీసీకి అధ్యక్షుడిగా జీ అనీల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వీ శేషగిరి రావు, కొలకలూరు డీసీకి జొన్నల మురళీకృష్ణరెడ్డి, తాడిబోయిన నాగేశ్వరరావు, తెనాలికి పెమ్మసాని శ్రీనివాస్, యలవర్తి రఘుబాబు, పొన్నూరు-1కు దేవరపల్లి పవన్‌కుమార్, బొలగాని రామారావు, పొన్నూరు-2కు గనిపిశెట్టి రామకృష్ణ, అన్నవరపు హనుమాయమ్మ, చేబ్రోలుకు నువ్వుల సునీల్‌చౌదరి, కల్లూరి తిరుపతిరావు, గుంటూరు ఛానల్-1కు దుద్దుకూరి బూషబాబు, సాధు కొండలరావు, గుంటూరు ఛానల్-2కు ఉప్పుటూరి తిరుపతిరావు, పసువులేటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎస్ఎస్‌పీ కింద ఉన్న మేడికొండూరు డీసీకి నలజర్ల రవికుమార్, యలమంచిలి రామకృష్ణచౌదరి, ఫిరంగిపురానికి ఆరె పున్నారెడ్డి, మద్దూరి శ్రీనివాసరెడ్డి, గుంటూరుకు ఏ నాగేశ్వర రావు, పతకమూరి కోటేశ్వరరావు, పొన్నెకల్లుకు గుంటుపల్లి మధుసూదనరావు, గర్నేడి శ్రీనివాస రావు, పెదనందిపాడు డీసీకి అధ్యక్షురాలిగా కల్లూరి కుసుమ, ఉపాధ్యక్షుడిగా మండవ శ్రీనివాసరావు ఎన్నికైనట్లు ఇరిగేషన్ గుంటూరు ఎస్ఈ వెంకటరత్నం తెలిపారు. కేడబ్ల్యూడీ కింద బాపట్ల జిల్లాలో ఉన్న వేమూరు డీసీకి అధ్యక్షుడిగా డీ వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా తోట ఏడుకొండలు, కొల్లూరులో యలవర్తి కోటేశ్వరరావు, మల్లంపాటి హరిప్రసాద్, వెల్లటూరులో యర్రంశెట్టి వెంకటకరుణ శ్రీనివాసరావు, వెలగపూడి రవిప్రసాదు, రేపల్లెలో యర్రగాల శ్రీనివాస రావు, కూచిపూడి మోహన్‌రావు, మోర్తోటలో పంతాని మురళీధరరావు, జొన్నా నరసయ్య, గోవాడలో మొహమాటం రాధాకృష్ణమూర్తి, కావూరి సత్యన్నారాయణ, కూచిపూడిలో కొరటాల లీల సత్య టసాయి, కేళం శ్రీనివాసరావు, పిట్టలవానిపాలెంలో షేక్ ముంతాజ్‌బేగం, నక్కల పోలిరాజు, జాగర్లమూడిలో టీ శివారెడ్డి, ఎండీ ఇస్మాయిల్, పొన్నూరు-3లో ఐనగంటి శ్రీకాంత్‌బాబు, బొద్దులూరి వెంకటేశ్వర్లు, బాపట్ల-1లో మల్లవరపు శ్రీనివాసరావు, దొప్పలపూడి రాజశేఖర్, బాపట్ల-2లో ఇమ్మడిశెట్టి మధుసూదనరావు, సీతా ఉపేంద్రరావు, చీరాలలో నీరుకట్టు పాండురంగారావు, నక్కల నాగరాజు, చినగంజాంలో పొడ వీరయ్య, జాగర్లమూడి సాయిప్రసాద్‌లు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఎన్ఎస్‌పీ ఏబీసీ కింద ఉన్న సంతమాగులూరులో కామాను శ్రీనివాసరావు, వల్లెం నరసయ్య, కొమ్మలపాడులో కంచేటి యలమందయ్య, కక్కెర సుబ్బారావు, అద్దంకిలో బీ శ్రీనివాస రావు, కే పేరయ్య, జే పంగలూరులో కే ఆంజనేయులు, డీ వీరాస్వామి, కోనంకిలో వీ చక్రపాణి, తాటి అంజనేయ స్వామి, ఇంకొల్లులో బండ్ల శ్రీనివసారావు, గుడి మల్లికార్జునరావు, ద్రోణాదులలో కొసరాజు దిలీప్, పీ మహబూబ్‌ఖాన్, పర్చూరులో డీ వెంకట సుబ్బారావు, తోట ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే టీసీ, డబ్ల్యూయూఏలకు గత వారంలో ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. మంగళవారం డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు కూడా ప్రశాంతంగా నిర్వహించారు. ఇక చివరిదైన ప్రాజెక్ట కమిటీ ఎన్నిక తేదీని కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 21వ తేదీ శనివారం పీసీ ఎన్నిక నిర్వహిస్తామని ఇరిగేషన్ ఎస్ఈ తెలిపారు. డీసీలకు ఎన్నికైన వారు పీసీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లను ఎన్నుకొంటారు. పీసీ ఎన్నిక తేదీ ఖరారైన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీలో కృష్ణా పశ్చిమ డెల్టాకు తీవ్ర పోటీ నెలకొన్నది. గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన నేతలు ఈ రెండు రోజుల్లో కూర్చుని ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లుగా ఎవరిని బరిలోకి దింపాలనే దానిపై ఒక నిర్ణయానికి వస్తారు.

సంక్రాంతికి సాధ్యమేనా?

456 రోడ్లకు 19 పనులే పూర్తి

- వారం లక్ష్యాలు నిర్దేశించినా విఫలం
- పనులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నత్తనడకన గుంతల రహిత రహదారుల పనులు
- గుంతల రహదారులతో వాహనచోదకుల ఇక్కట్లు

నత్తతో పోటీ...

- గుంటూరు జిల్లాలో 134 ప్యాకేజీల్లో చేపట్టిన గుంతల పూడ్చివేత పనులకు రూ.28.94 కోట్లు మంజూరయ్యాయి. అయితే రూ.10.24 కోట్లతో 10 పనులు చేపట్టగా రూ.3.03 కోట్ల విలువైన ఒక్క ప్యాకేజీలోని పని మాత్రమే పూర్తిచేశారు. 535 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులు చేపట్టగా ఇప్పటికి 69.40 కిలోమీటర్లల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు.
- పల్నాడు జిల్లాలో రూ.38.56 కోట్లతో 910 కిలోమీటర్లలో 124 పనులు మంజూరు చేశారు. వీటిలో 170.50 కిలోమీటర్ల మేర 18 ప్యాకేజీల్లో రూ.2.82 కోట్ల పనులు మాత్రమే పూర్తి అయ్యాయి.
- బాపట్ల జిల్లాలో 708.50 కిలోమీటర్లలో గుంతల పూడ్చివేత పనులను 198 ప్యాకేజీలుగా విభజించారు. రూ.46.79కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికి 55.02 కిలోమీటర్ల రోడ్లపై గుంతలు పూడ్చివేశారు. ఒక్క ప్యాకేజీలో కూడా పూర్తిస్థాయిలో పనులు పూర్తికానట్లు ప్రభుత్వ నివేదికలు తెలియజేస్తున్నాయి.



జానపాడు రహదారిలో గుంతలు

గోతుల రహదారులు సంక్రాంతి నాటికి కనిపించవు.. వైసీపీ హయాంలో ప్రజలు గుంతల రోడ్లతో పడిన ఇబ్బందులు ఇక ఉండవు.. అని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. గత నెలలో గుంతల రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టేందుకు పెద్ద ఎత్తున నిధులు కూడా మంజూరు చేసింది. ఆర్భాటంగా పనులను ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ప్రారంభించారు. అయితే కొన్ని దగ్గర్ల శరవేగంగా పనులు జరుగుతుండగా చాలాప్రాంతాల్లో గుంతల పూడ్చివేత పనులు అరకొరగా.. నత్తనడకన సాగుతున్నాయి. పనులు సాగుతున్న తీరును చూస్తే సంక్రాంతి నాటికి గోతుల రహిత రహదారుల లక్ష్యం అసాధ్యంగా కనిపిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో రోడ్ల పనులను 456 ప్యాకేజీలుగా విభజించి మరమ్మతులు చేపట్టగా ఇప్పటికి 19 పనులే పూర్తి చేశారు. దీనినిబట్టి ప్రభుత్వ లక్ష్యంపై అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.



పనులు పురోగతి ఇలా...

జిల్లా	మంజూరు	చేపట్టినవి	పూర్తయినవి
పల్నాడు	124	38	18
బాపట్ల	198	29	నిల్
గుంటూరు	134	19	1

పనికుంట ప్రాంతంలో గుంతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రధాన రహదారుల నుంచి సందుగొందుల్లోని రోడ్ల వరకు గోతుల మయం. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల అభివృద్ధి కాదు కదా.. కనీసం గుంతల పూడ్చాలన్న ఆలోచన చేయలేదు. దీంతో గుంతల రహదారులతో ప్రమాదాలు తరచూ జరగడం.. మరణాలు, గాయపడటం వాహన చోదకులకు పరిపాటిగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రజలు రోడ్డెక్కాలంటే వణికిపోవాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల రహదారులను విస్మరించగా కూటమి ప్రభుత్వం రోడ్లపై దృష్టిసారించింది. రహదారులను అభివృద్ధి చేస్తామని, గుంతలు లేని రహదారులను నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం గుంతల రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి సంక్రాంతి కల్లా గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పనులు చేపట్టి నెల దాటుతున్నా.. ప్రభుత్వ లక్ష్యాలు

(మిగతా 8వ పేజీలో)


వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే నసీర్

'వక్ఫ్' ఆస్తుల పరిరక్షణకు కంచెలా పని చేస్తాం: ఎమ్మెల్యే

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కంచెలా పని చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, వక్ఫ్ బోర్డు సభ్యుడు మొహమ్మద్ నసీర్ అన్నారు. విజయవాడలోని వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన చైర్మన్ ఎంపిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నసీర్ తో పాటు మిగిలిన సభ్యులు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చట్ట నిబంధనలకు అనుగుణంగా నూతన కార్యవర్గం పని చేస్తుందని, సంస్థను మరింత బలోపేతం చేసేందుకు, సంస్థ అభివృద్ధికి కొత్తదారులు ప్రణాళికలతో కమిటీ ముందుకు వెళుతుందని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కంచెలాగా పని చేస్తామన్నారు. ఈ కమిటీ వినూత్న వ్యూహాలను అమలు చేయడంలో, కమ్యూనిటీతో సహకారం పెంపొందించడంలో, ప్రత్యేక లక్ష్యం సాధనలో కీలకమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ముస్లింల ఆత్మ గౌరవం కాపాడటమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. మైనారిటీల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు తమీమ్ అన్సారీయా ఐఏఎస్, హాజీ ముక్రం హుస్సేన్, సయ్యద్ దావూద్ బాషా, షేక్ అక్రమ్, అఫియా, షేక్ ఖాజా మొహిద్దీన్ మోతవల్లి, మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్, వక్ఫ్ సీఈఓ అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

19న బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ఎన్‌సీసీ కోటా కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ కోర్సు ఎన్‌సీసీ కోటా కౌన్సెలింగ్ ఈ నెల 19న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విదర్భ 205 పరుగులకు ఆలౌట్


ఓం ధోత్రే (70 పరుగులు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో రాజస్థాన్, విదర్భ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భ జట్టు 73.4 ఓవర్లలో 205 పరుగులు చేసి ఆలౌట్ అయింది. విదర్భ బ్యాటర్లు ఓం ధోత్రే 12 ఫోర్లతో 70 పరుగులు, కశ్యప్ 35 పరుగులు చేశారు. రాజస్థాన్ బౌలర్లు పురు దేవద్వాల్, సుజల్ పార్మర్, ఆదిత్య వాద్వా మూడేసి వికెట్లు చొప్పున తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్‌లో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ జట్టు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 4 పరుగులు చేసింది.

ఆక్రమణలు, భూ సమస్యలపై వినతులు

- 52వ రోజు 'ప్రజాదర్బార్'లో అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేశ్



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న అర్జీదారులు

తాడేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యతో ఒకరు, పథకాలు ఇప్పించాలని మరొకరు భూ సమస్యలతో కొందరు.. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీదారులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. 52వ రోజు ప్రజాదర్బార్ మంగళవారం అర్జీదారులతో కిటకిటలాడింది. మంత్రి లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిసిన అర్జీదారులు తమ వినతిపత్రాలు సమర్పించారు.

ఆప్షన్ 2 అమలు చేయండి

చీరాల ఓడరేవు నుంచి నకిరేకల్లు వరకు 167ఏ నాలుగు లేన్ల జాతీయ రహదారిని ఎన్‌హెచ్‌ఏ అధికారులు 2022లో ప్రతిపాదించారు. ఇందులో అంతర్భాగంగా ఉన్న నర్సరావుపేట బైపాస్ నిర్మాణానికి మూడు ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో నరసరావుపేట దక్షిణం వైపు బైపాస్‌కు ప్రతిపాదించిన ఆప్షన్ 3 వల్ల ఐదు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున రైతులు నష్టపోవాల్సి వస్తుంది. రైతులకు తక్కువ నష్టం కలిగించే ఆప్షన్ 2ను అమలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే అరవిందబాబు నేతృత్వంలో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కుదువపెట్టిన బంగారం ఇవ్వట్లేదు

కరోనా సమయంలో తన బిడ్డ వైద్యం కోసం కుదువ పెట్టిన బంగారాన్ని ఇవ్వకుండా తన మేనమామ వేధిస్తున్నాడని జగ్గయ్యపేట నియోజకవర్గం తోటచర్లకు పద్మావతి ఆవేదన వ్యక్తం చేసింది. 120 గ్రాముల బంగారాన్ని మేనమామ వెంకటేశ్వరరావు వద్ద కుదువపెట్టి రూ.3 లక్షలు అప్పు తెచ్చి వైద్యం చేయించినా బిడ్డ బతకలేదని 2019లో రెండవ బిడ్డ యాక్సిడెంట్‌లో చనిపోయాడని పేర్కొన్నారు. తాను అప్పుగా తీసుకున్న డబ్బులు ఇస్తానన్నా కుదువపెట్టిన బంగారం తిరిగి ఇవ్వడం లేదని, పోలీసు అధికారులకు చెప్పినా న్యాయం జరగలేదని లోకేశ్‌కు విన్నవించారు.

పింఛన్ ఇప్పించండి

పుట్టుకతో తీవ్ర అనారోగ్యంతో జన్మించిన తన బిడ్డకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బద్వేలుకు చెందిన కొండమ్మ విన్నవించింది. ఒళ్లంతా పొక్కులతో కొలేడన్ బేబిగా జన్మించిన తన బిడ్డకు తమిళనాడులోని కంచి కామకోటి హాస్పిటల్‌లో రూ.17లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోయిందని, కలెక్టర్‌కు విన్నవిస్తే కడప రిమ్స్‌కు రాశారని, అక్కడ కూడా సరైన మందులు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రైవేటుగా కొనుగోలు చేస్తే నెలకు రూ.10 వేలు ఖర్చు అవుతుందని, రెక్కాడితేగాని డొక్కాడని తమకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. మరో వినతిలో.. యాక్సిడెంట్ తరువాత కోమాలోకి వెళ్లిన బిడ్డ వైద్యానికి రూ.18 లక్షలు ఖర్చు చేసిన ప్రయోజనం లేదని, ఇప్పటికీ వీల్‌ఛైర్‌కే పరిమితమయ్యాడని, డ్రైవర్‌గా ఉన్న తాను పక్షవాతానికి గురయ్యానని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని పైదుకూరు ప్రాంతానికి చెందిన అశోక్ విన్నవించారు.

బిల్లుల చెల్లింపుపై వినతి

వైసీపీ నేతల అండతో ఓ వ్యక్తి విశాఖలోని తమ స్థలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని తెనాలి నియోజవర్గం మోపర్రుకు చెందిన కృష్ణప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి సంబంధించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలని గారపాడుకు చెందిన మేస్త్రీ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. 2018లో ముట్లూరులో రెండు, గారపాడులో ఒకటి, అంగన్వాడీ భవనాలు నిర్మించి రూ.30 లక్షలు వెచ్చిస్తే ఆనాటి టీడీపీ ప్రభుత్వం రూ.11 లక్షలు ఇచ్చిందని, వైసీపీ వచ్చాక ఐదేళ్లు తిప్పించుకుని రూ.4లక్షలు ఇచ్చారని, వైసీపీ రంగులు వేయడానికి మరో ఆరు లక్షలు ఖర్చు చేయించారని కలెక్టర్ చుట్టూ తిరిగినా ఉపయోగం లేదని, అప్పుల పాలైన తనకు బిల్లులు నగదు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. రోడ్డు పేరుతో తమ ఇళ్లు తొలగించవద్దంటూ ఈ-11 రోడ్డు ఇళ్ల బాధితులు సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవితో ప్రజాదర్బార్‌కు విచ్చేసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల నుంచి వినతిపత్రాలను స్వీకరించిన లోకేశ్ వారికి అండగా ఉంటానని, అధైర్యపడొద్దని హామీ ఇచ్చారు.

దాతృత్వానికి ప్రతీక డాక్టర్ పీవీజీ రాజు

- శతజయంతి వేడుకల్లో మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు


పాటిబండ్ల విష్ణువర్ధన్‌ను సత్కరిస్తున్న అశోక్ గజపతిరాజు, బుద్ధ ప్రసాద్, గజల్ శ్రీనివాస్, లక్ష్మణ్ రెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ పీవీజీ రాజు మంచి మనసున్న మహారాజు అని, దాతృత్వానికి నిలువుటద్దమని, అలాంటి కుటుంబంలో జన్మించే అవకాశం కలగడం భగవంతుడు అందించిన వరం అని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి. అశోక్ గజపతిరాజు అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీజీ రాజు విద్యా పురస్కారాలను శారదా నికేతన్ వ్యవస్థాపకులు ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీ బాయమ్మ దంపతుల వారసురాలు వీ హేమ, పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ వ్యవస్థాపకులు పాటిబండ్ల సీతారామయ్య మనువడు పాటిబండ్ల విష్ణువర్ధన్‌కు, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ (హీల్) వ్యవస్థాపకులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్‌కు అశోక్ గజపతిరాజు చేతులు మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఎదిగే కొద్ది అహం పెంచుకోవద్దని, సమయపాలన పాటించాలని, సాధారణ వ్యక్తులుగా క్రమశిక్షణతో పెరగాలని చెప్పిన తన తండ్రి మాటలను గౌరవిస్తూ జీవిస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక విద్య మాతృ భాషలో ఉండాలని అన్నారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్యలో మాతృభాషను తొలగించడం వలన 10 లక్షల మంది బాలబాలికలు విద్యకు దూరమయ్యారని, వేలాది పాఠశాలలు మూతపడ్డాయని అన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పీవీజీ రాజు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు లోక్‌సభ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా పని చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉత్తర కోస్తా జిల్లాలలో విజయనగర రాజుల నుంచి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని మేలు పొందని వారు లేరన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ రాజకీయనేతలు పీవీజీ రాజును ఆదర్శంగా తీసుకోవాన్నారు. ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ పీవీజీ రాజు 250 ఎకరాల విస్తీర్ణంలో గల తన ప్యాలె స్‌ను కోరుకొండ సైనిక్ స్కూల్‌కి విరాళంగా ఇచ్చి భారతదేశంలో మొదటి సైనిక్ స్కూల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. పెనుమెత్స నాగరాజు సహకారంతో ప్రచు రించిన పూసపాటి రాజుల యొక్క పూర్వో త్తరం చారిత్రిక గ్రంథాన్ని అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో 'మానవత' నేతలు పావులూరి రమేష్, టీ ధనుం జయరెడ్డి, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీ రసూల్, బొమ్మి డాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఇండియన్ టొబాకో అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ చౌదరి పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌ఎం, ఎల్‌ఎల్‌బీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

పెదకాకాని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఉన్న ఎల్‌ఎల్‌ఎం, కోర్సుతోపాటు బీఏ ఎల్‌ఎల్బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల ఇంటి గ్రేటెడ్ కోర్సులకు ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పీ బ్రహ్మాజీరావు మంగళవారం తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవే శాలు పొం దేందుకు ఏపీ లా సెట్/ పీజీ లా సెట్ 2024లో ర్యాంకులు సాధించిన వారికి మాత్రమే ప్రవేశాలు కల్పించ నున్నట్లు స్పష్టం చేశారు. ఈ కోర్సులలో ప్రవేశాలు పొందే అభ్యర్థులు 23 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు రిజి స్ట్రేషన్ చేసుకోవాలని సూచిం చారు. ఎల్‌ఎల్‌ఎం కోర్సులో ఇంటర్నల్ స్లైడింగ్ నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. 18న ఉద యం 10 నుంచి 2 గంటల వరకు వర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలలో ఈ ఇంటర్నల్ స్లైడింగ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

జూనియర్స్ విభాగంలో బాపట్ల ఎడ్ల జతకు ప్రథమ స్థానం


జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానం సాధించిన బాపట్ల ఎడ్ల జత

గురజాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పట్టణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4000 అడుగుల దూరం బండ లాగి ప్రథమస్థానంలో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్ల జత 3900.5 అడుగులతో రెండోస్థానం, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకీ సురేంద్రరెడ్డి ఎడ్లజత 3831 అడుగులతో మూడోస్థానం, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన జత 3804.6 అడుగులతో నాలుగో స్థానం, హైదరాబాద్‌కు చెందిన ఎడ్ల జత 3723.2 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి.

గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

రాజుపాలెం,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలంటే ప్రజల సహకారం అవసరమని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. మండల కేంద్రమైన రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై గ్రామ స్థాయిలో, కళాశాలలో, పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో గంజాయిని విక్రయిస్తున్నారని, గంజాయికి ఎనిమిదో తరగతి విద్యార్థులు అలవాటు పడటం బాధ కలిగిస్తోందన్నారు. గంజాయి సేవించిన వారు ఎలా ప్రవర్తిస్తారో వారికే తెలియదన్నారు. మీ ప్రాంతాలలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే కనుక సమీపంలోని పోలీస్‌స్టేషన్లో గానీ, 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. గంజాయి విక్రయదారుల అరెస్టు విషయం విలేకరులకు తెలిపారు. మండలం లోని చౌటపాపాయపాలెంలో సోమవారం సాయంత్రం రైల్వేగేటు దగ్గర క్రోసూరు మండలం పారుపల్లికి చెందిన పారుపల్లి భూలక్ష్మీ చౌటపాపాయపాలెంకు చెందిన కుందూరు దుర్గారావు, వల్లాల ప్రసాదులకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు మెరుపుదాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారివద్ద ఉన్న సుమారు 2కెజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, రూ.3100నగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భర్తకు జైలు జరిమానా

నరసరావుపేట లీగల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భార్య మృతికి కారకుడైన భర్తకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. ఈ మేరకు స్థానిక అదనపు సహాయ సెషన్స్ న్యాయమూర్తి కే మధుస్వామి మంగళవారం తీర్పు నిచ్చారు. పద్దెనిమిదేళ్ల క్రితం చిలకలూరిపేటకి చెందిన దేశవత్ హనుమంతరావు నాయక్ వివాహం రమణ బాయితో జరిగింది. 2000 సంవత్సరం నుంచి మద్యానికి బానిసైన హనుమంతరావు తన భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో 2021 నవంబరు 30న ఎలుకల మందు తీసుకుని రమణబాయి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న చిలకలూరిపేట పట్టణ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువడింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

56,204 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 59,536 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 56,202 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 46,133 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	7500	14500
నెంబరు. 5	8000	12500	నెంబరు.5	8000	12000
273	12000	12000	273	8500	11500
341	8000	15000	341	7500	14000
4884	9000	10000	4884	10500	14200
సూపర్ 10	-	-	సూపర్ 10	10000	15200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16300	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	8000	14000
దేవనూరు డీలక్స్	9500	15000	దేవనూరు డీలక్స్	9000	13000
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4500	11000

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఇసుకరీచ్‌ని పరిశీలించిన విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్


మున్నంగి ఇసుకరీచ్‌ని పరిశీలిస్తున్న రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్, మైనింగ్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లిపర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 'ఉచితమన్నా దోపిడీనే' అనే శీర్షికను 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణకుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, మైనింగ్, రెవెన్యూ అధికారులు మంగళవారం మండల పరిధిలోని మున్నంగి ఇసుకరీచ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుకలోడింగ్ చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి అక్కడ కూలీలను వాహనాలకు లోడింగ్ చేసినందుకు నిర్వాహకులు ఎంత ఇస్తున్నారు, కృష్ణానదిలో యంత్రాల ద్వారా ఏమైనా లోడింగ్ చేస్తున్నారా, లోడింగ్ చేసినందుకు ప్రభుత్వం ఇచ్చిన ధర కన్నా అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారా అనే విషయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యశ్రావణకుమార్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల్లో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. కృష్ణానదిలో యంత్రాల ద్వారా లోడింగ్ చేసిన, అధికంగా వసూళ్లు చేసినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకరీచ్‌ని తనిఖీ చేసిన వారిలో విజిలెన్స్ సీఐలు కొమ్మాలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ, మైనింగ్ అధికారి కావ్య ఉన్నారు.

మళ్లీ పరుగులెత్తనున్న 'పోలవరం': కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పర్యటనతో పోలవరం ప్రాజెక్టు పనులు మళ్లీ పరుగులెత్తనున్నాయని టీడీపీ పల్నాడు జిల్లా అధ్య క్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన 'పోల వరం', రాజధాని అమరావతి రెండు కళ్లు వంటివని, గత ఐదేళ్లుగా ఈ రెండు నిర్లక్ష్యానికి గురవడమే కాకుండా సర్వ నాశనం చేశారని విమర్శించారు. ఈ రెండింటిని మళ్లీ ట్రాక్‌పైకి తీసు కొచ్చేందుకు చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ ప్రాజెక్టును త్వరిగతిన పూర్తి చేసేందుకు కేంద్ర జల సంఘం, పోలవరం అథారిటీతో చర్చలు జరిపి దిశానిర్దేశం చేశారని, ఈ ప్రాజెక్టు పూర్తి చేసి నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే సంకల్పంతో పని చేస్తున్నారన్నారు.

పాతగుంటూరు శివార్లలో యువకుడి హత్య

- డబ్బు విషయమై మద్యం మత్తులో దాడి
- పరారీలో ఐదుగురు నిందితులు


హత్యకు గురైన దీపక్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): మద్యం మత్తులో పాత గుంటూరు శివా ర్లలో యువకుడు హత్యకు గురైన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానిక పాత గుం టూరు పోలీసుల కథనం ప్రకారం, తెనాలి చెంచు పేటకు చెందిన యువ కుడు చప్పిడి దీపక్ (25) మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలం విశాఖపట్నంలో నివ సించిన అతను, అనా రోగ్య సమ స్యలు తలెత్తడంతో తిరిగి తెనాలికి వచ్చాడు. గుం టూరులోని ఎస్వీఎన్ కాలనీకి చెందిన యువకుడు గద్దల కిరణ్‌తో స్నేహం ఏర్ప డింది. వీరిద్దరూ తరచుగా మద్యం తాగేవారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో కిరణ్ ఫోన్ పే నుంచి రూ. 50 వేలు, దీపక్ తన ఫోన్ పే కి కొట్టుకున్నాడు. ఈ విషయం తెలుసు కున్న కిరణ్, తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వమని దీపక్‌ను పలుమార్లు అడిగాడు. డబ్బులు ఇవ్వకుండా దీపక్ వాయిదా వేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం వాళ్లిద్దరూ తెనాలిలో మద్యం తాగారు. గత రాత్రి వీళ్లిద్దరూ గుం టూరులో కలుసుకుని మద్యం తాగాలని నిర్ణయించు కున్నారు. స్థానిక పాత గుంటూరుకు చెందిన తన స్నేహితులు శివశం కర్, అశోక్, గోపి, అక్బర్‌లను వెంటబెట్టుకొని వెళ్లిన కిరణ్, శివారు ప్రాంతాల్లోని రాజీవ్ గృహకల్ప వద్ద అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. ఈ క్రమంలో దీపక్, కిరణ్‌ల మధ్య డబ్బు వివాదం జరిగింది. తనకు డబ్బులు ఇవ్వాలని కిరణ్ గట్టిగా నిల దీశాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది, కిరణ్, తన వెంట వచ్చిన వారు కలిసి దీపక్ పై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన దీపక్ ను వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆటో మాట్లాడి తరలించారు. అయితే, ఆటో డ్రైవర్‌కి దీపక్ పేరును వెంకటరెడ్డి అని చెప్పి పంపించారు. జీజీ హెచ్‌లో చేర్చిన ఆటో డ్రైవర్, క్షతగాత్రుడు పేరుని వెంకట్ రెడ్డి అని నమోదు చేయించారు. చికిత్స పొందుతున్న దీపక్ తెల్లవారుజామున మృతి చెందాడు. దీపక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు పరారీ లో ఉన్నట్లు పాత గుంటూరు పోలీసులు తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఎస్సీ వర్గీకరణలో జిల్లా యూనిట్ విధానంపై పునరాలోచించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో జిల్లా యూనిట్ విధానంపై పునరాలోచించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా యూనిట్ విధానంలో వర్గీకరణ సక్రమంగా జరగదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర మొత్తం యూనిట్‌గా పరిగణించి వర్గీకరణ చేపట్టాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు మాలలు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ నాయకులు ఏటుకూరి విజయ్‌కుమార్, రాజు, నాగరాజు, శ్రీనివాసరావు, వలేటి భూషణం, భవానీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచార్యుల జయంతి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై కోగంటి సీతారామచార్యుల 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య ప్రారంభించారు. సభకు ఎంపీ సత్యవతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ ప్రవచనకర్తలు శ్రీ కూర్మనాథ స్వామి, డాక్టర్ కోగంటి రంగనాయకి హాజరై 2024 సంవత్సరానికి సీతారామచార్యుల పురస్కారాన్ని విశ్రాంత హిందీ అధ్యాపకురాలు తూపురాణి గోదాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏవీ దక్షిణామూర్తి, డాక్టర్ ఎస్వీ రమణా రావు, డాక్టర్ కేవీఎల్ఎన్ అప్పలాచార్యులు, డాక్టర్ ఎం.లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా బ్రాహ్మణ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా అధ్యక్షుడు జె.పార్థసారధి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్ శర్మ మాట్లాడుతూ సభ్యులు వ్యక్తిగత, న్యాయపరమైన సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించారు. ఏపీ ఎన్జీవో నాయకులు నరసింహమూర్తి ప్రసంగిస్తూ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలు, కొత్త డీఏలను వెంటనే చెల్లించాలన్నారు.

మిర్చియార్డు పూర్వ సెక్రెటరీ ఐవీ రెడ్డికి పోస్టింగ్

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు పూర్వ సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఐ వెంకటేశ్వరరెడ్డికి ప్రభుత్వం పోస్టింగ్ కల్పించింది. గత రెండు నెలల నుంచి ఆయన పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఐవీ రెడ్డికి నెల్లూరు ఏఎంసీలో పోస్టింగ్ ఇచ్చింది. మరోవైపు రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి సెక్రెటరీగా ఉంటూ నరసరావుపేట ఏఎంసీకి ఆన్‌డ్యూటీ సెక్రెటరీగా ఉన్న గుంటూరు యార్డు కార్యదర్శి వినుకొండ ఆంజనేయులుకు ప్రత్యామ్నాయంగా నరసరావుపేట, రాజమహేంద్రవరంలలో వేరొకరికి పోస్టింగ్‌లు కల్పించాలని డైరెక్టర్‌ని ఆదేశించింది.

నంబూరు-మంగళగిరి మధ్య రైల్వేగేటు మూసివేత

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నంబూరు-మంగళగిరి మధ్య మరమ్మతుల కోసం రైల్వేగేటుని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 20వ తేదీ రాత్రి 7 గంటల వరకు గేటు నంబరు.14 మూసి ఉంటుందన్నారు. దీని దృష్ట్యా ట్రాఫిక్‌ని డాన్‌బాస్కో స్కూలు, నవులూరు సెంటర్, క్రికెట్ స్టేడియం, నిడమర్రు మీదగా మళ్లించడం జరుగుతుందన్నారు.


సంగీత వారసత్వానికి దీప స్తంభం జాకీర్ హుస్సేన్

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భారతదేశ గొప్ప సంగీత వారసత్వానికి దీప స్తంభం ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ అని సంగీత విద్వాంసుడు ఎస్ఎస్ మల్లేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సంగీత విద్వాంసుడు జాకీర్‌హుస్సేన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, బిళ్ళా అశోక్, రామ కృష్ణారెడ్డి, శివప్రసాద్, వెంకాయమ్మ తదితరులున్నారు.

అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీలకు ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లో రూట్ ఫిట్నెస్ సెంటర్‌లో గుంటూరు డిస్ట్రిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషుల విభాగంలో జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19వ తేదీన పిఠాపురంలో జరిగే అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి కే వేణుగోపాలరావు తెలిపారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణహారం


స్వర్ణ హారం

భద్రాచలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి మంగళవారం గుంటూరుకు చెందిన పాదర్తి బ్రదర్స్ స్వర్ణ హారాన్ని సమర్పించారు. 35 గ్రాముల బరువుతో రూ.2.5 లక్షల విలువైన ఈ హారాన్ని దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

● అధికారులను ఆదేశించిన కమిషనర్ పులి శ్రీనివాసులు


జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, గ్యాంగ్ వర్కల ద్వారా డ్రెయిన్లు, సమస్యాత్మక ప్రాంతాలు శుభ్రం చేయడంపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, ఎన్జీవో కాలనీ, సాయినగర్, నల్లపాడు, బుడంపాడు, శ్రీనివాసరావుతోట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మైక్రో ప్యాకెట్స్ వారీగా చేపట్టే పారిశుధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదని పలు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. శానిటేషన్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఇంటింటి చెత్త సేకరణ, మెయిన్ రోడ్ల స్వీపింగ్, కమర్షియల్ సంస్థలు డ్రైన్లలో వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్జీవో కాలనీ పార్క్‌ని పరిశీలించి, ఓపెన్ జిమ్ పరికరాలు మరమ్మతులకు గురవ్వడంతో తక్షణం మరమ్మతులు చేయాలని, పెండింగ్ పనులపై పార్క్ వాకర్స్ కమిటీతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. బుడంపాడులోని హిందూ, క్రిస్టియన్ శ్మశానవాటికలను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో డీఈఈలు మధుసూదన్, సతీష్, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఆర్వోలు రెహ్మాన్, రవి కిరణ్‌రెడ్డి, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనధికార ట్యాపు, డ్రైనేజ్ కనెక్షన్ కలిగి ఉండటం నేరం

నగరపాలక సంస్థ పరిధిలో అనధికార ట్యాప్, డ్రైనేజి కనెక్షన్లు కల్గి ఉండడం చట్టరీత్యా నేరమని, అటువంటి కనెక్షన్ల తొలగింపునకు ప్రత్యేక బృందాలతో డ్రైవ్ చేపడుతున్నామని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కుళాయి కనెక్షన్‌కు దరఖాస్తు చేసిన నిర్దేశిత సమయంలోనే కనెక్షన్ అందిస్తామన్నారు. అనుమతి లేకుండా సుమారు 6 వందలు కుళాయి, డ్రైనేజి కనెక్షన్లు కల్గి ఉండడం గమనించి వాటి తొలగింపుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.


వసతి గృహ విద్యార్థినులతో పాలకవర్గ సభ్యులు

నిజాయితీ, క్రమశిక్షణ అలవరుచుకోవాలి

● కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని, చుక్కపల్లి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జీవితంలో నిజాయితీ, క్రమశిక్షణ అలవరుచుకోవాలని కమ్మజన సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు అన్నారు. మంగళవారం కుందురోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా వసతిగృహంలో ఉంటూ ఇంజనీరింగ్ పూర్తి చేసి, ఇప్పుడు వీడ్కోలు చెప్పడం బాధగా ఉందని అన్నారు. భవిష్యత్తులో ఏ స్థాయికి చేరుకున్నా వసతి గృహాన్ని మర్చిపో వద్దని సూచించారు. జీవితంలో ఉన్నతస్థితికి చేరుకుని తల్లిదండ్రుల అభివృద్ధి, క్షేమాన్ని చూడాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందిన 30 మంది విద్యార్థినులను వారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గసభ్యులు మల్లెల హరేంద్రనాద్ చౌదరి, వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, మద్దిపూడి సీతారామయ్య, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీలో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు


● మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవో లకు ఆదేశాలు

● ఐవీ ఆర్ ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరించిన ప్రభుత్వం

గుంటూరు సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పారదర్శకతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. పెన్షన్లు పంపిణీ ముగిసిన తర్వాత ఐవీఆర్ఎస్ ద్వారా లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరిస్తుంది. అందులో భాగంగా నవంబరు 30, డిసెంబరు 2 వ తేదీన పెన్షన్లు అందుకున్న జిల్లాలోని లబ్ధిదారులకు ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ కాల్స్ వచ్చాయి. పెన్షన్ పంపిణీ చేసేటప్పుడు ప్రభుత్వ సిబ్బంది అవినీతి కి పాల్పడితే ఎస్.. లేకుంటే నో అని చెప్పాలని అడిగారు. ఈ సర్వేలో కొందరు ఎస్ అని చెప్పటంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఎస్ అని సమాధానం వచ్చిన చోట లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారించి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ లు, ఎంపీడీవోలను ప్రభుత్వం ఆదేశించింది. విచారణ ఆధారంగా అవినీతికి పాల్పడిన సిబ్బందిపై అధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

పెంపుడు శునకానికి ఘన నివాళి


● వర్ధంతి సందర్భంగా మిస్ యూ జిమ్మీ అంటూ ఫ్లెక్సీలు వేసిన యజమాని



జిమ్మీ వర్ధంతి పేరుతో వెలసిన ఫ్లెక్సీ

గుంటూరు సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జంతు ప్రేమికులు ఏదో ఒక రూపేణ నిరంతరం ఆ ప్రేమను వ్యక్తపరుస్తూనే వున్నారు. సాధారణంగా బాగా దగ్గర వాళ్ళు దూరం అయితే ప్రతి ఏడాది ఆ రోజును తలచుకొని నిట్టూరుస్తూ ఉంటాం. ఫ్లెక్సీలు.. వర్ధంతులు జరుపుకుంటూ ఉంటాం. గుంటూరు నగరంలోని పాతిమాపురానికి చెందిన సీతంశెట్టి శ్రీనివాసరావు అనే జంతు ప్రేమికుడు చనిపోయిన తన శునకం వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించి ప్రేమను చాటుకొన్నారు.. ఆయన 14 ఏళ్ల క్రితం తెలిసిన వాళ్ళ దగ్గర డాబర్ మెన్ క్రాస్ బ్రీడ్‌కు చెందిన కుక్క పిల్లను తెచ్చుకొని అపురూపంగా పెంచుకున్నారు. దానికి జిమ్మీ అని పేరు పెట్టుకున్నారు. మధ్యలో క్యాన్సర్ రోగం వస్తే ఖరీదైన వైద్యం కూడా చేయించి బతికించుకున్నారు. ఇంత చేసినా ఏమి ప్రయోజనం!? .పాపం జిమ్మీని కాలం చిన్న చూపు చూసింది. గత ఏడాది డిసెంబరు 17వ తేదీన ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదానికి గురైంది. స్పీడ్‌గా వచ్చిన కార్ ఢీ కొనడంతో అక్కడికక్కడే ప్రాణం వదిలింది. ఆరోజు దాని మరణం కళ్లారా చూసి శ్రీనివాసరావు ఎంతో కుంగిపోయారు. కుటుంబంలో మనిషి పోయినంతగా బాధపడ్డారు. ఆ బాధను మరిచి పోవడానికి మరో శునకాన్ని తెచ్చుకున్నారు. అయితే గుండెల్లో పదిలంగా ఉన్న జిమ్మీ జ్ఞాపకాలను మరిచిపోలేక పోయారు. అందుకే గిరగిరా తిరిగి వచ్చిన డిసెంబరు 17న(మంగళవారం) జిమ్మీకి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్లెక్సీలు వేసి ఇంటి ముందు పెట్టి జాకీ వదిలి వెళ్ళిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

వీవీఐటీని సందర్శించిన అశోక్ గజపతిరాజు


వీవీఐటీలో పుస్తకాలు పరిశీలిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజు

పెదకాకాని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు వీవీఐటీ కళాశాలను మంగళవారం సందర్శించారు. విజయ నగరం మహారాజు డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి వేడుకలకు గుంటూరు విజ్ఞాన మందిరంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన వీవీఐటీ కళాశాల 33వ పుస్తక ప్రచురణ పూసపాటి రాజుల పూర్వోత్తరం 'హకీకత్తు పూసపాటి విజయరామరాజు' గ్రంథం ఆవిష్కరించిన అనంతరం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఆయనకు స్వాగతం పలికారు. జనచైతన్య వేదిక సహకారంతో ప్రచురించిన ఈ పుస్తకంలో పూసపాటివారు ఏవిధంగా విజయనగరంరాజులు అయ్యారనేది సంపాదకుడు మోదుగుల రవికృష్ణ వివరంగా పొందుపరిచారు. ఈ సందర్భంలో అశోక్ గజపతిరాజు ప్రచురించిన పుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహాదేవ్, సెక్రెటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రెటరీ మమిళ్ళపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ వై మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక తులసీ సహస్ర నామార్చనలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్ శ్రీరామ నామ క్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శ్రీమాన్ క్రోసూరి మురళీకృష్ణమాచార్యులు, ఆలయ అర్చకుల బృందంతో ధ్వజారోహణ, సంతానార్థులకు గరుడప్రసాద వితరణ జరిగింది. సామూహిక శ్రీరామ కోటి తులసి సహస్రనామార్చనలు, వేదపారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం జంధ్యాల కృష్ణకుమారి, హైదరాబాద్ వారిచే పార్వతి కల్యాణం హరికథ, శ్రీ వెంకటాచలపతి బృందం, చెన్నై వారిచే మహా సంకీర్తనలతో శేషవాహనంపై శ్రీరామ కోటి నగరోత్సవం కనుల పండువగా జరిగింది. కార్యక్రమాల్ని క్షేత్రం కార్య నిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు, పోలిశెట్టి హరిప్రసాదరావు, పాతకోటి బ్రాహ్మణయ్య నాయుడు పర్యవేక్షించారు.

విజ్ఞాన్ నిరులాలో ముగిసిన అంతర కళాశాల ఖోఖో పోటీలు

గుంటూరు (విద్య), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జేఎన్‌టీయూ, కాకినాడ అంతర్ కళాశాల ఖోఖో పోటీలు మంగళవారం ముగిశాయని ప్రిన్సిపాల్ పాతూరి రాధిక తెలిపారు. స్పోర్ట్స్ బోర్డు కౌన్సిల్ డైరెక్టర్ జీ శ్యామ్‌కుమార్, ఐటీసీ సెక్రటరీ జీపీ రాజు అతిథులుగా హాజరయ్యారు. రెండు రోజుల పాటు సాగిన పోటీల్లో ఐడియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాకినాడ టీం విజేతగా నిలవగా, శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల టీం ద్వితీయ స్థానంలో, విజ్ఞాన్ నిరులా, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకి నాడ, జేఎన్‌టీయూ, కాకినాడ కంబైన్డ్ రన్నర్స్ అప్‌గా నిలిచినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ కిషోర్‌కుమార్ తెలిపారు.

ఆర్‌వీఆర్ అండ్ జేసీలో 'అర్బన్ ఎక్స్ హాక్‌థాన్'

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అర్బన్ ఎక్స్ హాక్‌థాన్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కళాశాల ఐఈఈఈ, ఐఈఎస్ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్, కళాశాల ఐఐసీ చాప్టర్‌ల సంయుక్త సహకారంతో 'అర్బన్ ఎక్స్' రీథింక్, డిజైన్ అండ్ హ్యాక్ యూ సి టీస్ ఫ్యూచర్ అనే పేరుతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 24 గంటల హాక్‌థాన్ పోటీలు జరిగా యని ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కేఎల్ యూనివర్సిటీ డీటీఐ డీన్ కే నరసింహరాజు హాజరయ్యారు.

టీజేపీఎస్ అథ్లెటెక్స్ విజేతలకు అభినందనలు

గుంటూరు (విద్య), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్. కళాశాలలో డిగ్రీ చదువుతున్న క్రీడాకారులు ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అంతర కళా శాలల అథ్లెటిక్స్ పోటీల్లో మధు కావ్యరెడ్డి 100, 200 మీటర్ల పరుగుపందెం, పీ శ్రీనివాస్ 400 మీటర్ల హడిల్స్, ఎస్ కార్తీక్ 110 మీటర్ల హడిల్స్, ఈశ్వర్ లాల్ నాయక్ 20 కిలోమీటర్ల నడక విభాగాల్లో స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. త్వరలో ఆయా విద్యార్థులు 26 నుంచి 30వ తేదీ వరకు ఒడిశాలోని కిస్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ అనితాదేవి పేర్కొన్నారు. విద్యార్థులను కళా శాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, వ్యాయామ అధ్యాపకులు ఆర్ శివాజీ అభినందించారు.

కాంగ్రెస్ నేతల పండ్లు పంపిణీ

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని షిర్డీసాయి దీన జన సేవా సమితిలో విభిన్న ప్రతిభావంతులకు పండ్లు పంపిణీ చేశారు. చిలకా విజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ సిద్ధాంతాలు, ఆశయాల కోసం వైఎస్ షర్మిల అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచకొండ జాన్‌బాబు, షేక్ జబీవుల్లా, బిళ్ళా సునీల్, షేక్ కరీం, ముస్కాన్, బాలస్వామి, గుప్తా తదితరులున్నారు.

మోడల్ స్కూళ్లలో మెరుగైన బోధన అందించాలి

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో మెరుగైన బోధన అందించి మంచి ఫలితాలు సాధించాలని సంయుక్త డైరెక్టర్ తెహరాసుల్తానా సూచించారు. మంగళవారం పాతబస్టాండులోని పరీక్ష భవన్‌లో నిర్వహించిన జోన్-3 ప్రిన్సిపాళ్లతో సమీక్ష లో ఆమె మాట్లాడారు. డిప్యూటీ డైరెక్టర్ రవిసాగర్, ఏడీ శరత్‌బాబు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కేవీ సత్యం పాల్గొన్నారు. పాఠశాలల స్థితిని పరిగణనలోకి తీసుకొని పది, ఇంట ర్మీడియట్ పరీక్షల కోసం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సుల్తానా సూచించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ అదనపు భారాలు మోపే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. పొన్నూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అదానీ కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలన్నారు. విద్యుత్ చార్జీల విషయంలో వైసీపీ అనుసరించిన విధానాలనే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని విమర్శించారు. నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు 1706 కోట్ల రూపాయలు లంచం ఇచ్చినట్లు అమెరికా కోర్టులలో కేసు నమోదు చేయబడిందని, ఈ భారం రాష్ట్ర ప్రజలపైనే వేశారని ఆరోపించారు. ఈ భారాలను రాష్ట్ర ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఏవో రామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనల్లో పాశం రామారావు, ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, దండా లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు, చిష్టి, బి.ముత్యాలరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు : పలిశెట్టి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రతపై ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2019లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉత్తర్వులను ఉన్నతాధికారులు అమలు చేయకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తున్నారని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ఆరోపించారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో మంగళవారం జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో కొంత మంది ఉన్నతాధికారులు సమస్యలు సృష్టించి ఉద్యోగులను ఉద్యమాల వైపునకు బలవంతంగా నెడుతున్నారని ఆరోపించారు. నెల్లూరు జోన్ ఈయు జోనల్ కార్యదర్శి దాసరి బాబూ శామ్యూల్ మాట్లాడుతూ ఈహెచ్ఎస్ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా నాయకులు విజయ్ కుమార్ మాట్లాడూతూ ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరికి ప్రస్తుతం ఇస్తున్న 180 రోజులు చైల్డ్ కేర్ లీవులను 730 రోజులకు పొడిగించాలని కోరారు. సభకు షేక్ కరీముల్లా అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, డీవీ స్వామి, ఏపీ రావు, కాశీం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గుంటూరు డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్ మూడోలైన్‌కి చెందిన షేక్ జానీ బాషా అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. జానీబాషా రింగ్‌రోడ్డులోని డాన్ బాస్కో మెయిన్ గేట్ పక్కన ఉన్న పంచర్ల షాపులో పనిచేస్తూ ఉంటాడు. మద్యానికి బానిసైన జానీబాషా పనిచేయగా వచ్చిన డబ్బులతో తాగి రోడ్ల పై పడిపోతూ ఉంటాడు. ఆయనకు భార్య కుమార్తె సంతానం ఉన్నారు. అయితే ఈ నెల 13న మద్యం తాగి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. జీజీహెచ్‌లో చికిత్స చేయించుకొని అనంతరం ఇంటికి తీసుకువెళ్లారు. అయితే మంగళవారం ఆకస్మికంగా వాంతులు విరోచనాలు కావడంతో వెంటనే జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాషా మృతి చెందాడు. భార్య షకీరా ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థుల్ని దత్తత తీసుకుని చదివించేలా ప్రణాళిక

● పది సీ, డీ గ్రేడ్‌లో ఉన్నతంగా తీర్చిదిద్దుతాం

● డీఈవో సీవీ రేణుక


సీవీ రేణుక

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులు అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశామని డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. ఈ ఏడాది పరీక్షల ప్రణాళికలపై ఆమె మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది 23,332 మంది విద్యార్థినీ, విద్యార్థులు పది పరీక్షలకు హాజరౌతున్నారని అన్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి అయిందని, ప్రస్తుతం ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ జరుగుతున్నాయని తెలిపారు. పది విద్యార్థులకు ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏ, బీ, సీ, డీ అనే నాలుగు గ్రేడులుగా విభజించినట్లు చెప్పారు. ఇందులో సీ, డీ గ్రేడుల విద్యార్థుల్ని ప్రత్యేకంగా కొంతమంది సబ్జెక్టు ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారిని నిత్యం పర్యవేక్షిస్తూ చదివిస్తుండేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. గత ఏడాది పదిలో జిల్లా 88 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 16వ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలోని టాప్‌టెన్ లేదా టాప్ 5 స్థానం సాధించేలా ఉపాధ్యాయుల సమష్టి కృషితో పరీక్షలకు విద్యార్థుల్ని సిద్ధం చేస్తున్నామని వివరించారు. విద్యార్థులకు జడ్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. విద్యార్థులకు త్వరలో అల్పాహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా హైస్కూల్ ప్లస్‌కు సంబంధించి 15 స్కూల్స్‌లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థినులు ఉన్నారని చెప్పారు. బాలుర కోసం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఏడు పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉన్నారని అన్నారు. మిగిలిన పాఠశాలల్లో కూడా ప్రణాళిక బద్ధంగా విద్యార్థుల్ని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ఎన్నికలకు నేడు నామినేషన్‌లు

● అధ్యక్ష రేసులో యేల్చూరి, బాలకృష్ణ

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్‌చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా మారాయి. చాంబర్ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలంగా వ్యవహరిస్తున్న ఆతుకూరి ఆంజనేయులు ఈ దఫా చాంబర్ గౌరవాధ్యక్షుడిగా వ్యవహరించాలని తీర్మానించిన విషయం తెలిసిందే. కాగా నూతన అధ్యక్షుడిగా మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు బరిలోకి దిగుతున్నారు. ఇక గతంలో చాంబర్ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేసిన రంగా బాలకృష్ణ గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. బాలకృష్ణ కూడా ఈ దఫా అధ్యక్ష బరిలో నిలిచి ఎలాగైనా తన పట్టు నిలుపుకునేందుకు ఇప్పటికే వ్యాపారవర్గాల నుంచి మద్దతు కూడగడుతూ, ఆత్మీయ సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 28న జరుగనున్న ఎన్నికలకు చాంబర్ అధ్యక్ష పదవికి బుధవారం నామినేషన్‌ల ప్రక్రియ జరుగనున్నది. అధ్యక్ష పదవికి రంగా బాలకృష్ణ, యేల్చూరి వెంకటేశ్వర్లు నామినేషన్‌లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. మరో వైపు చాంబర్ ఎన్నికలు ఏకగ్రీవం చేసేందుకు పలువురు ఆర్యవైశ్య పెద్దలు సయోధ్యకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యం

● రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ ప్రధానంగా రాష్ట్రంలోని రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, జీవనోపాధి మెరుగుదలకు కృషి చేయడమే లక్ష్యమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఏపీ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ కో ఆపరేషన్ అడ్వైజర్, మాజీ ఐఏఎస్ టీ.విజయ్‌కుమార్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ సైన్సెస్, అపారి (ఆసియా పసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్), యూరోపియన్ ప్లాంట్ హెల్త్ రీసెర్చ్ అండ్ కోఆర్డినేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా.. రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్టనర్‌షిప్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే ఇంటర్నేషనల్ సదస్సును మంగళవారం ఘనంగా ప్రారంభించారు. మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్ మాట్లాడుతూ రసాయన యుక్త వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా సేంద్రియ విధానాలను ప్రోత్సహించడం, సేంద్రియ ఎరువులు, విత్తనాలు, పద్ధతులపై అవగాహన కూడా కల్పిస్తామన్నారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం సబ్సిడీలు అందించడం, పంటల బీమా పథకాలను అమలు చేయడం, పంటల డైవర్సిఫికేషన్, రైతులను వివిధ రకాల పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. బ్యాంకాక్‌లోని అపారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి నుంచి వినియోగం వరకు వ్యవసాయ, ఆహార వ్యవస్థలో ఆధునిక పద్ధతులను అనుసరించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో యూరోపియన్ ఫైటోశానిటరీ రీసెర్చ్ కోఆర్డినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ బల్దిస్సెర జీవాని, హైదరాబాద్‌లోని ఐకార్ ఐఐవోఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్, అపారి టెక్నికల్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ డబ్ల్యూజే టేలర్, సౌత్ ఆసియా కాబి ఇంటర్నేషనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పక్షపాత ధోరణితో రాష్ట్ర ప్రభుత్వం

● పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ ఎదుట వైసీపీ నేతల బైఠాయింపు, నిరసన

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో వైసీపీ కార్యకర్తలను అక్రమ అరెస్టు చేస్తున్న పోలీసులు వైసీపీ ఫిర్యాదులను మాత్రం పట్టించుకోవటం లేదంటూ అంబటి నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ నెల 21లోగా చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హామీ ఇచ్చారంటూ నాయకులు నిరసన విరమించారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో డిప్యూటీ మేయర్, తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, అంగడి శ్రీనివాసరావు, మామిడి రాము, సీడీ భగవాన్, సాంబయ్య, మొండితోక శ్రీనివాసు, వర్ధన్ తదితరులున్నారు.

నటనకు తొలి మెట్టు రంగస్థలం

రంగస్థలంపై నటనకు శ్రీకారం చుట్టి సినిమాల్లో నటించి ఒక వెలుగు వెలిగిన నటీనటులు ఎందరో. స్టేజ్‌పై డైలాగ్స్ చెబుతూ, హావభావాలు పలికిస్తూ.. ప్రేక్షకుల చప్పట్లతో మార మోగిపోతుంటే ఆ కళాకారుడు, దర్శకుడు పొందే ఆనందం మాటల్లో చెప్పలేం. అయితే, ఆ రచయితో, కళాకారుడో, దర్శకుడో తమ ప్రతిభ చాటుకోవాలంటే ఒక వేదిక కావాలి.. అవకాశమూ రావాలి. అటువంటి అవకాశాలు కల్పించేవి నాటక కళాపరిషత్‌లు, మెమోరియల్ ట్రస్టులు ఆంధ్రరాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. అటువంటివాటిలో ఒకటి పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టు. నాటకాల ద్వారానే స్వచ్ఛమైన నటుడు బయటకు వస్తాడన్న ఆయన కుమారుడి ఆకాంక్ష మేరకు అలాంటి నటుల కోసం ఆ ట్రస్టు ద్వారా పరుచూరి వెంకటేశ్వర రావు నాటక పోటీలను నిర్వహిస్తున్నారు.


పల్లెకోనలోని నందమూరి తారక రామారావు కళా భవనాన్ని ప్రారంభిస్తున్న అప్పటి మాజీమంత్రి కోడెల శివప్రసాద్



పల్లెకోనలో టి.సుబ్బరామిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన పరుచూరి రఘుబాబు, టి.సుబ్బరామిరెడ్డి కల్యాణమండపం


పరుచూరి రఘుబాబుకు నివాళులర్పిస్తున్న తల్లిదండ్రులైన పరుచూరి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మీ కుమారుడు రవి

- నాటకాలకు ఊపిరిపోస్తున్న పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టు
- కుమారుడు జ్ఞాపకార్థం పల్లెకోనలో కళాప్రాంగణం
- ముప్పై రెండేళ్లుగా కొనసాగుతున్న పోటీలు

● రేపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సినిమా కథలు, మాటల రచయితలు, నటులు, నాటక రచయితలు పరుచూరి బ్రదర్స్ వెంకటేశ్వర రావు, గోపాలకృష్ణలు తమ రచనలతో ఎంత ప్రజాదరణపొందారో ప్రత్యేకంగ చెప్పక్కర్లేదు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోనలో పరుచూరి రఘు బాబు మెమోరియల్ ట్రస్టును 1991లో ఏర్పాటు చేశారు. అఖిల భారత స్థాయిలో నాటకోత్సవాలనునిర్వహిస్తున్నారు. సమాజంలో రుగ్మతలు, దోపిడీ వ్యవస్థ, సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని రచించి ప్రజలను చైతన్యపరిచే నాటికలను ప్రోత్సహిస్తూ, నాటక రంగం అభివృద్ధి కోసం ఈ ట్రస్టు తమ వంతు పాత్ర పోషిస్తోంది.



పరుచూరి వెంకటేశ్వరరావు, భార్య విజయలక్ష్మికి ఇద్దరు కుమారులు పరుచూరి రఘుబాబు, పరుచూరి రవి, కుమార్తె పద్మావతి. రఘుబాబు గతంలో మృతి చెందారు. తన కుమారుడు గుర్తుగా పల్లెకూన లో నంద మూరి తారకరామారావు కళాప్రాంగణాన్ని ఏర్పాటు చేసిన వెంకటేశ్వరరావు, ప్రతి సంవత్సరం అఖిలభారత నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. పరుచూరి వెంకటేశ్వరరావు నాయనమ్మ గ్రామం, ఆయన భార్య విజయలక్ష్మి సొంత ఊరు పల్లె కోన. అంతేకాదు, రఘుబాబు తన చిన్నతనంలో కొంత కాలం పల్లెకూనలో పెరిగాడు. ప్రతి ఏడాది ఐదురోజుల పాటు పౌరాణిక, జానపద నాటక పోటీలు జరుగుతాయి.

దాతల సహకారం..

రేపల్లెకు పట్టణానికి చెందిన వేములపల్లి సుబ్బారావు 63 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. మరికొంతమంది 37 సెంట్ల స్థలాన్ని పరుచూరి వెంకటేశ్వరరావుకు ఉచితంగా ఇచ్చారు. దీంతో పాటు తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సహకారంతో ఆడిటోరియం సినీని ర్మాత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీ సుబ్బిరామిరెడ్డి సహకారంతో పరుచూరి రఘుబాబు, టి.సుబ్బిరామిరెడ్డి లలితకళాపరిషత్ భవనాన్ని నిర్మించారు. వీటిని మాజీ మంత్రి కోడెల శివప్రసాద్, పరుచూరి బ్రదర్స్ అప్పట్లో ప్రారంభించారు.



నాటక ప్రారంభంలో జ్యోతిప్రజల్వన కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటులు రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర రావు, ఎమ్మెల్యే ఆనందబాబు


అలెగ్జాండర్ నాటికలో ప్రతిభ కనబరిచిన జయప్రకాష్‌రెడ్డికి మెమొంటోను అందిస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు, ఎంఎస్‌నారాయణ (ఫైల్ ఫోటో)

కుమారుడి ఆశయం కోసం..



ట్రస్టీ పరుచూరి వెంకటేశ్వరరావు తమ కుమారుడు రఘుబాబు ఆశయం, భార్య విజయలక్ష్మి కోరిక మేరకు పల్లెకోనలో గతంలో ఆడిటోరియం నిర్మించి ప్రతియేటా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నాం. వయస్సురీత్యా పెద్దవాడిని కావడం, దూరాభారం కావడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నేను ఉన్నంత వరకూ కళారంగాన్ని ప్రోత్స హిస్తాను. 32 సంవత్సరాలు పాటు వందలాది నాటకాలను ప్రదర్శించి కళాకారులను ప్రోత్సహించాను. నటన లేక పోయినా హీరోలు అయ్యే పరిస్థితి ప్రస్తుతం సినీరంగంలో ఉంది.

స్నాతకోత్సాహం

(5వ పేజీ తరువాయి)..
డిగ్రీలను ప్రదానం చేశారు. ఎయిమ్స్‌మంగళగిరి సెంటర్‌ఫర్ మెడికల్‌ఎడ్యుకేషన్‌టెక్నాలజీ బ్రోచర్‌ను కేంద్రసహాయమంత్రిజాదవ్ ఆవిష్కరించారు.

47 మందిలో 17 మంది మహిళలే

ఎయిమ్స్‌లో డిగ్రీలు తీసుకున్న 47 మందిలో 17 మంది మహిళలే. దీనిపై రాష్ట్రపతి ముర్ము హర్షం వ్యక్తం చేశారు. వైద్యవృత్తిలో పెరుగుతున్న మహిళల బాగస్వామ్యంతోపాటు వారి గణనీయమైన సహకారాన్ని చూస్తూ ఉంటే అభివృద్ధి చెందుతున్న సమాజంగా మారుతున్నట్లు అనిపిస్తోందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు మొదటి బ్యాచ్ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లన్నారు. తన ప్రసంగంలో ముందుగా ఆమె మంగళగిరి క్షేత్రాన్ని గురించి ప్రస్తావించి వేదికపై నుంచే పానకాలస్వామికి నమస్కారాలను తెలిపారు. నరసింహస్వామి చెంత వైద్యవిద్యను అభ్యసించిన విద్యార్థులందరూ ఎంతో అదృష్టవంతులన్నారు. వైద్యులు సేవకు ప్రాధాన్యమివ్వాలని, యువ వైద్యులు మరింత చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు పూర్తిస్థాయి ఆరోగ్యవంతులుగా ఉండాలని.. అందుకోసం ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

దేశ భవిష్యత్ నగరంగా అమరావతి - ముఖ్యమంత్రి చంద్రబాబు

దేశ భవిష్యత్ నగరాల్లో ఏపీ రాజధాని అమరావతి ప్రముఖంగా నిలువబోతుందని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు.దేశంలోని ఎయిమ్స్‌లన్నింటిలోనూ రాజధాని అమరావతి పరిధిలోని మంగళగిరి ఎయిమ్స్ నెంబర్‌వన్‌గా నిలుస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఎలాంటి మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వబోమని హామీ ఇచ్చారు. దేశంలోని ఏ ఎయిమ్స్‌లో కూడా ఇంత సుందరమైన, ఆహ్లాదకర మైన వాతావరణం లేదన్నారు. ముర్ము సామాన్య ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి దేశ అత్యున్నత పదవిని సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదనడానికి ద్రౌపదిముర్ము జీవితమే ఒక ఉదాహరణ అని చెప్పారు. సీఎం చంద్రబాబు రాష్ట్రపతి ద్రౌపదిముర్మును శాలువతో సన్మానించి తిరుమల శ్రీవారి మెమొంటోను అందజేశారు. రాష్ట్రపతికి మంత్రి నారా లోకేశ్ మంగళగిరి చేనేత చీరెను బహూకరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ మదబానందకర్, కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

స్వల్ప వివాదం.. ఆగిన వివాహం

- తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కూతురుతో ఓ ఐపీఎస్‌కు వావాహం నిశ్చయం
- కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్లాలని పట్టుబట్టిన పెళ్లి కుమార్తె తరపు బంధువులు
- ససేమిరా అన్న ఐపీఎస్ వరుడు ● నిలిచిన పెళ్లి .. రంగంలోకి కాంగ్రెస్ నేతలు
- అర్థరాత్రి వరకు కొనసాగుతూనే ఉన్న చర్చలు

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప విషయంలో తలెత్తిన వివాదంతో ఓ ఐపిఎస్ పెళ్లి కి బ్రేక్ పడింది. పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కాగా పెళ్లి కుమార్తె డాక్టర్. వివరాల్లోకి వెళ్తే నగరానికి చెందిన యువకుడు గుజరాత్ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన ప్రొఫెషనరీ పీరియడ్ పూర్తి చేసుకొని అక్కడ ఓ జిల్లాకు ఎస్పీగా ఇటీవలే నియమితులయ్యారు. ఆయనకు తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కుమార్తె అయిన డాక్టర్ తో వివాహం నిశ్చయించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు డాన్ బాస్కోలో వివాహం జరగాల్సి ఉంది. మరి కొద్దిసేపట్లో పెళ్లి తంతు ప్రారంభం కావలసిన సమయంలో తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిన పెళ్లి కుమార్తె తరపు బంధువులు పెద్ద సంఖ్యలో పట్టాభిపురం మెయిన్ రోడ్డుపై జూట్ మిల్స్ సమీపంలో ఉన్న ఐపీఎస్ అధికారి ఇంటి వద్దకు వెళ్లారు. తెలంగాణలోని తమ సంప్రదాయం ప్రకారం ఇరువురిని ఇంటి వద్ద నుంచి డాన్ బాస్కో వరకు కారులో కాంగ్రెస్ పార్టీ జెండాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లాలని పట్టుబట్టారు. ఎళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కావడంతో అందుకు ససేమిరా అన్నారు. దీంతో ఈ విషయం మీరు వర్గాల మధ్య పంతానికి దారి తీసింది. చివరకు సున్నితమైన అంశం వివాదాస్పదంగా మారడంతో బ్రేక్ పడింది. పెళ్లి కుమార్తె తండ్రి తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యేని రాక ప్రభుత్వం ఏఐసీసీలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో తొలుత సంప్రదింపులు ద్వారా సమస్య పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మాజీ ఎమ్మెల్యే బంధువులు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పెళ్లి కుమారుడు ఇంటి వద్ద పెళ్లి హడావిడి చేశారు. దీంతో పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారులతో పోలీసులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది.

ఇతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మస్తాన్వలి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సుంకర పద్మశ్రీ లతోపాటు కల్లూరు కాంగ్రెస్ నాయకులు ఐపీఎస్ అధికారి ఇంటికి వెళ్లి ఆయనతో కుటుంబ సభ్యులతో చర్చలు జరుపుతున్నారు. పీటల మీద పెళ్లి నిలిచిపోయిందని తెలియడంతో పెళ్లి కుమార్తె తల్లి గుండెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పెళ్లికి ఐపీఎస్ అధికారి కుటుంబ సభ్యులు విముఖత చూపుతుండటంతో వారిని ఒప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అర్థరాత్రి దాటిన చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి మరో వైపు పెళ్లికి మాత్రం తరుపున వచ్చిన సుమారు వందల మంది పెళ్ళి కుమారుడి బయటే మోహరించి కూర్చున్నారు. పెళ్లి కుమారుడు తరఫున ఆయన బంధువైన ఫాదర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో చర్చలు జరుపుతున్నారు.

అబాకస్‌లో మువ్వా వేదాన్ష్ ప్రతిభ

- 8 నిమిషాల్లో 200 సమస్యలను పరిష్కరించి అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ కైవసం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యూనివర్సల్ కాన్సెప్ట్ మెంటల్ ఆర్థమెటిక్ సిస్టమ్(ఈసీఎమ్ఎఎస్) ఆధ్వర్యంలో ఢీల్లీలో ఈ నెల 14,15 తేదిల్లో జరిగిన అంతర్జాతీయ అబాకస్, మెంటల్ ఆర్థమెటిక్ పోటీల్లో నగరంలోని తారకరామ్‌నగర్‌కు చెందిన మువ్వా వేదాన్ష్ సత్తా చాటాడు. కేవలం 8 నిమిషాలలో 200 సమస్యలను పరిష్కరించి ఓవరాల్ అంతర్జాతీయ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ఈపోటీలకు 30 దేశాలు, పలు రాష్ట్రాలను చెందిన దాదాపు 6వేల మంది విద్యార్థులు హాజరైయ్యారు. ఈ పోటీలలో మువ్వా వేదాన్ష్ పాల్గొని ఈ ఘనతను సాధించారు. ఇప్పటికే అబాకస్ లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్న మువ్వా వేదాన్ష్‌ను పలువురు అభినందించారు.


ఓవరాల్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ ట్రోఫితో మువ్వా వేదాన్ష్

పరీక్షా కాలమ్



నిశిత పరిశీల.. విశ్లేషణ సాధనతో
గణితంలో మెరుగైన మార్కులు

'పదో తరగతి పరీక్షల్లో అత్యంత కీలకమైన సబ్జెక్టు గణితం. సాదాసీదా విద్యార్థులు సైతం కొద్దిగా కష్టపడితే అత్యధిక మార్కులు తెచ్చుకుని స్కోరు పెంచుకునే అవకాశం ఉంది. దానికోసం నిశిత పరిశీలన, విశ్లేషణాత్మక సాధన అవసరం' అని గుంటూరు లోని చౌత్రా సెంటరులో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఆట్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'పరీక్షా కాలమ్'లో గణితంలో సాధన గురించి పదో తరగతి విద్యార్థులకు ఆయన చెవుతున్న పలు సూచనలు..

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు ప్రారంభం అయ్యే వరకు ప్రతి రోజు లెక్కల్ని విభాగాల వారీగా సాధనం చేయడం ఫార్మూలాలు మననం చేసుకోవడం వంటి జాగ్రత్తలతో మెరుగైన మార్కులు సాధించేందుకు అవకాశం ఉంది. పటిష్టమైన సాధనతో గణితంలో నూటికి 95 పైగా ఒక్కోసారి నూటికి నూరు మార్కులు సాధించే అవకాశం ఒక్క గణితం సబ్జెక్టులోనే సాధ్యం అనే విషయం విద్యార్థులు విస్మరించకూడదు. అయితే దీనికి నిరంతర సాధన ఎంతో అవసరం. ఒకటికి మూడు సార్లు లెక్కల్ని సాధన చేయాల్సి ఉంటుంది. గణితంలో సెమ్ 1లో ఏడు పాఠ్యాంశాలు,సెమ్-2లో మరో ఏడు పాఠ్యాంశాలు చొప్పున మొత్తం 14 పాఠ్యాంశాలు ఉంటాయి.

- తొలుత రియల్ నెంబర్స్‌లో ప్రధానంగా హెచ్‌సిఎఫ్, ఎల్‌సియంరూట్‌నంబర్స్ సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. ఇందులో ఒన్‌మార్కు, 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి.
- తరువాత పెయిర్ ఆఫ్ లీనియర్‌లో ఇక్వేషన్స్‌లో గ్రాఫ్‌కు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. సరళరేఖల జతలకు సంబంధించిన నిష్పతుల పోలిక, బీజగణతం వివరణకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి ఇవి ఎనిమిది మార్కులకు ఇస్తారు.
- కోఆర్డినేట్ జామెట్రిలో ప్రధానంగా డిస్టెన్స్ ఫార్మూలా, సెక్షన్ ఫార్మూలా మీద ప్రశ్నలు వస్తాయి. ఇవి నాలుగు మార్కులకు వస్తాయి.
- అర్థమెకటిక్ ప్రొగ్రెసెన్స్ ఇందులో ఎపి అర్థమెటిక్ ప్రొగ్రెసెన్, ఎన్త్ ఎన్ వ పదం, ఎన్‌వ పదాల మొత్తం వంటి వాటి మీద ప్రశ్నలు వస్తాయి.
- సెమిస్టర్-2లో ప్రొబలిటి పాఠంలో కార్డ్సలెక్కలు డైస్‌మీద,కాయిన్స్ మీద ఉన్నటువంటి లెక్కలు 13 మార్కులకు వస్తాయి.
- స్టాటిస్టిక్స్‌లో మీన్,మీడియన్,మోడ్ మీదున్న సమస్యలు, ఫార్మూలా వివరణ మీద 12 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.
- ఇంటర్‌డక్షన్ ఆఫ్ ట్రిగనామెట్రీ, అప్లికేషన్ ఆఫ్ ట్రిగనామెట్రీలో విభావంలో 8 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ఇందులో బొమ్మవేయడం, పార్టులు రాయడం, తరువాత సమస్య పరిష్కారం చేయాలి.
- పరీక్ష సమయంలో ముందుగా ప్రశ్నా పత్రాన్ని బాగా చదువుకోవాలి. పూర్తిగా అర్థం చేసుకున్న తరువాతే రాయడం ప్రారంభించాలి.
- గణితం పరీక్షలో ముందుగా బాగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలి, రాని ప్రశ్నలు మరోసారి పరిశీలించి రాయాలి. కనీసం ఫార్మూలా వేసినా లేదా లెక్కను గుర్తున్న వరకు చేసిన మార్కులు వస్తాయి.
- ఇప్పుడు ఉన్న సమయంలో ప్రతిరోజు విభాగాల వారీగా లెక్కల్ని సాధన చేయాలి. ఫార్మూలాలు గుర్తుంచుకోవాలి. పరీక్షల అప్పుడే పరీక్షల సమయంలో మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

ఆట్ల శ్రీనివాసరెడ్డి,
గణిత ఉపాధ్యాయుడు,
ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల
గుంటూరు.



సంక్రాంతికి సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పల్నాడు.. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,153.50 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులకు రూ.113.99 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రహదారులను ప్యాకేజీలుగా విభజించి 456 పనులు చేపడితే ఇప్పటికి 19 పనులు మాత్రమే పూర్తయినట్లు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి. పనులు నత్త నడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో గుంతల రహదారులతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. సంక్రాంతి కల్లా పనులు పూర్తవుతాయని ప్రభుత్వం ప్రకటించినా పురోగతి ఆమేరకు కనిపించడంలేదు. మూడుజిల్లాల్లో కాస్తంత పల్నాడు జిల్లాలో పనులు పురోగతి కొంత మెరుగ్గా ఉంది. రహదారుల గుంతల పూడ్చివేతకు వారం వారం లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినా ఆ మేర లక్ష్యాలను చేరుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. పనుల్లో జరుగుతున్న జాప్యంతో రహదారుల ఇక్కట్లు ఇప్పట్లో వాహనదారులకు తీరే పరిస్థితులు కానరావడం లేదు. పురోగతిని పరిశీలిస్తే ప్రభుత్వం ప్రకటించినట్లుగా సంక్రాంతికి పూర్తి అయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో కూడా రహదారులపై గుంతల పూడ్చివేతపై చర్చ జరిగింది. వేగవంతంగా పనులు పూర్తి చేసి రహదారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి

- కొద్ది రోజుల్లోనే ముగియనున్న ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం
- రేపు సమావేశమై చర్చించనున్న నేతలు

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్‌లో ఎన్నికల హడావిడి ప్రారంభమైంది. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం జనవరి 12వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త కమిటీని ఎన్నుకొనేందుకు ఎన్నికల నిర్వహణపై కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొని ఆ దిశగా ముందుకెళ్లాలని సభ్యులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం (డిసెంబరు 19వ తేదీ) 6 గంటలకు ఏటుకూరు రోడ్డులోని ఫ్యాన్సీ డిస్ట్రిబ్యూటర్స్ ప్లాజాలో సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ సెక్రెటరీ డీ నరేంద్రబాబు సభ్యులకు సమాచారం అందించారు. ఎన్నికలతో పాటు గత రెండేళ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని సభ్యుల ముందుంచుతామన్నారు. అలానే కమీషన్ ఏజెంట్‌లు మిర్చియార్డులో ఎదుర్కొంటున్న ఇతరత్రా సమస్యల పైనా చర్చించనున్నారు.

త్రికోటేశ్వరునికి మహా రుద్రాభిషేకం

- జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు

కోటప్పకొండ (నరసరావుపేట), డిసెంబరు 17 : ఆరుద్రోత్సవం సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి మహారుద్రాభిషేకాలు సోమవారం అర్థరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు నేత్ర పర్వంగా జరిగాయి. సుగంధ ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, విభూది, గంధం, కుంకుమ, తైలం, సుగంధ ద్రవ్యాలు, ఫలాలతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. స్వామికి అన్నాభిషేకం వైభవంగా జరిగింది. అర్థరాత్రి పాత కోటేశ్వర స్వామి దేవాలయం వద్ద కర్పూర జ్యోతి దర్శనం చేసుకొని భక్తులు పులకించి పోయారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షించారు.


శ్రీ త్రికోటేశ్వర స్వామికి అన్నాభిషేకం


పాలు, గంధం, చెక్కర, ఎండు ఫలాలతో స్వామి వారికి అభిషేకాలు

మంత్రి నారా లోకేశ్‌కు వినతి

తాడేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి లోకేశ్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు. హైకోర్టు తీర్పు ప్రకారం న్యాయంగా రావలసిన రూ.43 కోట్లను తమకు అందేలా చూడాలని కోరారు. కార్మికుల దీక్షలు మంగళవారంతో 15వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో స్టీవెన్, దుర్గారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు

1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 120 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 63 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 54, నిజాంపట్నంకాల్వకు 146, కొమ్మమూరు కాల్వకు 1245 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

27 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 17: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో నామమాత్రంగా 118 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కాయ, కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,600, గరిష్ఠధర రూ.9,600, మోడల్‌ధర రూ.9,600 పలికాయి.

రమణమహర్షి జయంతి

పెదనందిపాడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బొడ్రాయి సెంటర్ సంగం డెయిరీ పాయింట్ వద్ద పోలకం గురుస్వామి ఆధ్వర్యంలో రమణమహర్షి జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కంచిబొట్ల శ్రీనివాసశర్మ విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాంప్ రైటర్ నల్లమోతు శంకరరావు, గురుస్వామి, సాయి పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ షర్మిల

జన్మదిన వేడుకలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ సలీమ్ ఆధ్వర్యంలో పాతమంగళగిరి శ్రీకృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో కేకు కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. చినకాకాని షైన్ అనాథ శరణాలయంలో బాలబాలికలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రామనాథం పూర్ణచంద్రరావు, హనుమంతరావు, రత్నగోపాల్, న్యాయవాది గుజ్జర్లపూడి జాన్‌బాబు, మండ్రు శ్రీనివాసకుమార్, దామర్ల మల్లేశ్వరరావు, కొప్పాకుల కృష్ణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు తొలగించవద్దని

మంత్రి లోకేశ్‌కు వినతి

మంగళగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి మంగళగిరి హైవేను అనుసంధానం చేసే ఈ-11 రహదారి నిర్మాణంలో తమ ఇళ్లు తొలగించవద్దంటూ ఎర్రబాలెం గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ప్రజాదర్బార్‌లో మంత్రి నారాలోకేశ్‌ను కలిసి విన్నవించారు. సీపీఎం, టీడీపీ నేతలతో కలిసి లోకేశ్‌కు అర్జీ అందజేశారు. అధికారులు ఈ-11 రోడ్డు కోసం సర్వే చేసి మార్కింగ్ ఇచ్చిన ప్రాంతంలో అనేక మంది పేదలు నివసిస్తున్నారని, పేదల ఇళ్లతోపాటు దళితుల శ్మశాన వాటిక కూడా పోతుందని, రోడ్డు ఎలైన్‌మెంట్‌లో మార్పులు చేసి తమ ఇళ్లు పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొండపై రోడ్డు వేసేందుకు కావలసినంత స్థలం ఉందని, అటవీ శాఖ అధికారులతో మాట్లాడి ఆ స్థలం గుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం రవి, అత్తలూరి వీరవెంకయ్య, టీడీపీ నేతలు సాలి నరేష్, సాగర్, శ్రీనివాసరావు, యేసు దయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి అమ్మవారికి సారె..

మంగళగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి బాపూజీ విద్యాలయంలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో రెండోరోజు పట్టణ వికాస తరంగిణి, శ్రీలక్ష్మీనృసింహస్వామి యతిరాజ సేవా మండలి ఆధ్వర్యంలో శ్రీగోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి సమక్షంలో మహిళలు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు జోగేంద్ర చక్రవర్తి, మాజేటి సూర్యవేణుగోపాల కృష్ణ, విజయలక్ష్మి, జంపని పద్మావతి, డోగిపర్తి లక్ష్మీ భగవతి సుందరి, చిన్ని విజయలక్ష్మి, గాదంశెట్టి సుజాత తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారం కోసమే

రెవెన్యూ సదస్సులు

కాకుమాను, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిందని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. మండలపరిధిలోని గరికపాడులో మంగళవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. భూ సర్వే కోసం ఐదు అర్జీలు, భూమి రికార్డుల్లో నమోదు కోసం 24 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏవో

కాకుమాను, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న వరి కోతలను ఏవో కిరణ్మయి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వాతావరణ శాఖ మరో రెండు రోజులు వానలు కురిసే అవకాశం ఉందని తెలిపారని, రైతులు వాన లేకపోతేనే వరి కోతలు చేసుకోవాలని సూచించారు. కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులపై టార్పాలిన్ పట్టాలు కప్పుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకోవాలని రైతులకు సూచించారు.

డీసీ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

ఏకగ్రీవమే!



అప్పాపురం ఛానల్ డీసీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులతో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఎన్నికల అధికారి, డీఆర్‌డీఏ పీడీ విజయ లక్ష్మి, సభ్యులు

మంగళగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా వెస్ట్రన్ డివిజన్ తెనాలి, కొలకలూరు హైలెవల్ ఛానల్, గుంటూరు ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుల, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కృష్ణావెస్ట్రన్ డివిజన్ తెనాలి డీసీ ఎన్నికల్లో దుగ్గిరాల నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గొరినేని అనిల్‌కుమార్‌ని డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగి సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చినపాలెం నీటిసంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన విసరపు శేషగిరిని ఎన్నుకున్నారు. అలాగే, కొలకలూరు హైలెవల్‌ఛానల్ డీసీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా నంబూరు నీటి సంఘం అధ్యక్షుడు జొన్నాల మురళీ కృష్ణారెడ్డిని, ఉపాధ్యక్షుడిగా కే.కొండూరు నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన తాడిబోయిన నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. గుంటూరు చానల్-1 (ఆత్మకూరు) డీసీ ఎన్నికల్లో ఉప్పలపాడు నీటి సంఘం అధ్యక్షుడు దుద్దుకూరి బుషాబాబును అధ్యక్షుడిగా, ఆత్మకూరు నీటి సంఘం అధ్యక్షుడు సాధు కొండలరావును ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను టీడీపీ నేతలు అభినందించారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల నీటి పంపిణీ కమిటీ ఛైర్మన్‌గా గొర్నేని అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. స్థానిక నీటి పారుదల శాఖ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా విసరపు శేషగిరిరావు, కమిటీ సభ్యులుగా ఎం. ధనలక్ష్మి, గోగం నాగేశ్వరరావు, మాఘం వంశీకృష్ణ, సోమరాజు వరప్రసాద్, నర్రా శివప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కూటమి నాయకులు మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, గూడూరు వెంకట్రావు, దుగ్గిరాలయార్డు మాజీఛైర్మన్ కొండపనేని చటర్జీ, ఎంపీటీసీలు తాళ్ళ అశోక్, పుతుంబాక సాయికృష్ణ, మండల జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, గద్దె వాసు, కేసంనేని వాసు, దేవరపల్లి చంటి, గరికా శ్రీను, కన్నెగంటి సాంబశివరావు, పసుపులేటి రవి యాదవ్, కాసరనేని కృష్ణ, మన్నెం అశోక్, శంకర్‌నా యక్, గండు కోటి, కొలకలూరి శ్రీనివాసశర్మ, ఎతఈఈ లక్ష్మీనారాయణ, ప్రకాశ్, లక్ష్మణ్ పాల్గొని నూతనంగా ఎన్నికైనవారిని సత్కరించారు. ఎన్నిక అధికారిగా డీఈఈ గడ్డం ముత్యంబాబు వ్యవహరించారు.

వట్టిచెరుకూరు, (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అప్పాపురం చానల్ ఆయకట్టులో నీటి వినియోగ దారుల సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో అధ్యక్ష, ఇతర సభ్యులు ఏకగ్రీవంగా టీడీపీ కైవసం చేసుకోగా మంగళవారం పొన్నూరులోని డ్రెయినేజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి ఎన్నికల అధికారిగా హాజరై డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. అప్పాపురం ఛానల్ ఆయకట్టులో ఆరు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుల్లో ఐదుగురు హాజరు కాగా టీకేపాలెం నీటి వినియోగ దారుల సంఘం అధ్యక్షులు గరికపాడు గ్రామానికి చెందిన నువ్వుల సునీల్ చౌదరి. ఉపాధ్యక్షులుగా వట్టిచెరుకూరు నీటి వినియోగ దారుల సంఘం అధ్యక్షులు కల్లూరి తిరుపతిరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈఎన్నికల్లో కాకుమాను నీటి వినియోగ దారుల సంఘం అధ్యక్షుడు బీ అంకమ్మ, వల్లూరు నీటి సంఘం అధ్యక్షులు ఆళ్ళ బ్రహ్మారెడ్డి, కారెంపూడి నీటి సంఘం అధ్యక్షుడు కోడె సుబ్బారావులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఒక్కొక్కరే నామినేషన్‌లు వేయటంతో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి వారికి అధికార పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు నాగిశెట్టి నాగరాజు, వట్టిచెరుకూరు ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, ఏదుబాటి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): వంకాయలపాడు మేజర్ డీసీ కమిటీ అధ్యక్షుడిగా కోయవారిపాలెం గ్రామానికి చెందిన అయినంపూడి నాగేశ్వరరావును, పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ డీసీ కమిటీ అధ్యక్షుడిగా తిమ్మాపురం గ్రామానికి చెందిన కల్లూరి కుసుమలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నీటి సంఘాల ఎన్నికల అనంతరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఈ రెండు కమిటీలక ప్రత్తిపాడు మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఎన్నికయ్యారు. వంకాయలపాడు మేజర్ కాలువకు సంబంధించి ఉపాధ్యక్షులుగా పెదపలకలూరుకు చెందిన పతకమూరి కోటేశ్వరరావు, సభ్యులుగా గుంటుపల్లి దేవయ్య, సాయిబాబ, పోలిరాజు హరిప్రసాద్‌లు ఎన్నికయ్యారు. అలాగే పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి ఉపాధ్యక్షులుగా మండవ శ్రీనివాసరావు, సభ్యులుగా జెట్టి సీతమ్మ, యిక్కుర్తి కోమలి, కోటపాటి సదాశివరావు, కొల్లా ఆదిశేషయ్య, పోతినేని వేణుగోపాల్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీలను గుంటూరు జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి త్రినాద్, పెదనందిపాడు జనసేన అధ్యక్షులు నరేంద్ర, ప్రత్తిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గింజుపల్లి శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, కాసు పెంటారెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

'పది'విద్యార్థులకు మోడల్ టెస్‌బుక్స్ పంపిణీ

కాకుమాను, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ నేతలు మంగళవారం మోడల్ టెస్టు పుస్తకాలను పంపిణీ చేశారు. కాకుమానులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొమ్మూరు, గరికపాడు, చిన్నలింగాయపాలెం, రేటూరు, బోడిపాలెం, అలాగే స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల(బాలికల)లోని 245 మంది విద్యార్థులకు ఎంఈవో కెన్నడీ, విజయ్‌భాస్కర్‌లు యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు నాగమణితో కలసి మోడల్ టెస్ట్ పుస్తకాలు అందజేశారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 70పుస్తకాలను ఉప్పుటూరి రామ్ చౌదరి(ఎన్‌ఆర్‌ఐ) సహకారంతో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో కెన్నడీ మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల కోసమే కాకుండా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం చేస్తున్న కృషిపట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. యూటీఎఫ్ మండల శాఖ సెక్రటరీ గేరా ఏసోబు, మండల శాఖ గౌరవ అధ్యక్షుడు ఈపూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు రూ 20 వేల విలువైన పుస్తకాలను పంపిణీ చేసిన ఎన్‌ఆర్‌ఐ రామ్ చౌదరి, యూటీఎఫ్ సంఘ బాధ్యులకు విద్యార్థులు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ .జిల్లా కార్యదర్శి పీవీ శ్రీనివాస్, మండల శాఖ సభ్యులు దొంతినేని సాయికృష్ణ, ఫాతిమా, అనీత జవహర్‌రాణి, తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన మోడల్ టెస్ట్ పుస్తకాలతో విద్యార్థులు



వీవీఐటీలో పుస్తకాలు పరిశీలిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక గజపతిరాజు

వీవీఐటీని సందర్శించిన

కేంద్ర మాజీ మంత్రి పూసపాటి

పెదకాకాని, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్రమాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు వీవీఐటీ కళాశాలను మంగళవారం సందర్శించారు. విజయనగరం మహా రాజు డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి వేడుకలకు గుంటూరు విజ్ఞాన మందిరం నందు ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల 33వ పుస్తక ప్రచురణ పూసపాటి రాజులయొక్క పూర్వోత్తరం 'హాకీ కత్తు పూసపాటి విజయరామరాజు' గ్రంథం ఆవిష్కరించిన అనంతరం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఆయనకు స్వాగతం పలికారు. జనచైతన్య వేదిక సహకారంతో ప్రచురించిన ఈ పుస్తకంలో పూసపాటివారు ఏవిధంగా విజయనగం రాజులు అయ్యారనేది సంపాదకుడు మోదుగుల రవికృష్ణ వివరంగా పొందుపరిచారు. ఈసందర్భనలో అశోక్ గజపతిరాజు వీవీఐటీ ప్రచురించిన పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

రైతుల బాండ్ల తనిఖీ

దుగ్గిరాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీ సంస్థ ప్రతినిధులు రెండ్రోజుల పాటు జరిగి 205 మంది బాధిత రైతుల బాండ్లను తనిఖీ చేసినట్లు బీమాసంస్థ ప్రతినిధి జుబేర్ ఆలీఖాన్ తెలిపారు. మండలకేంద్రం దుగ్గిరాలలో ఈఏడాది జనవరి 19న స్థానిక శుభంకోల్డ్‌స్టోరేజిలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన 400 మందికి పైగా రైతులు నిల్వబెట్టిన పసుపునిల్లలు అగ్నికి ఆహుతైన విషయం విదితమే. బాధిత రైతులకు సంబంధించిన బాండ్‌లను బీమా సంస్థ బృందం తొలివిడత తనిఖీలు మంగళవారం పూర్తి చేసింది. వీరిలో 14మంది వ్యాపారులు కూడా ఉన్నారని, దూర ప్రాంతం నుంచి రాలేని మహిళలు, వృద్ధులకు సంబంధించిన బాండ్లను వారి ఇండ్లకే వెళ్ళి తనిఖీ చేస్తామన్నారు. ఒకరిపేరుమీద మరొకరు కోల్డ్‌స్టోరేజికి వచ్చి పసుపునిల్వలు పెట్టి బాండ్లు తీసుకున్న వారు ఉన్నారని, వారిలో అర్హులెవరో నిర్ధారించి పరిహారం అందించడం జరుగుతుందన్నారు. మరో పర్యాయం తనిఖీకి వచ్చేముందుకు రైతులకు సమాచారం అందిస్తామని వివరించారు.

వడ్డేశ్వరంలో చోరీ

● 30 గ్రాముల బంగారం, రూ.5 వేలు చోరీ

తాడేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన గాలేషా కుటుంబ సభ్యులతో కలిసి బందరు వెళ్లగా, ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఈ ఘటన జరిగింది. బీరువా పగలగొట్టి అందులో వున్న 30 గ్రాముల బంగారపు వస్తువులు, రూ.5 వేల నగదు చోరీకి గురయ్యాయని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జరిగిన ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రూ అప్ చార్జీల భారం తగ్గించాలి

● సీపీఎం నాయకులు డిమాండ్

పెదనందిపాడు, డిసెంబరు, 17 (ఆంధ్రజ్యోతి) : ట్రూఆప్ చార్జీల భారం తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన విరమించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో సీపీఎం మండల పార్టీ నేతలు విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలపై కరెంట్ చార్జీల భారం తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, హామీ అమలు జరగడం లేదన్నారు. 2024 వరకు వాడుకున్న కరెంటు సర్దుబాటు చార్జీలు వసూలు పేరుతో వేలకోట్ల రూపాయల భారం ప్రజల నెత్తిమీద వేయడం సరికాదన్నారు. కరెంట్ చార్జీలు రద్దు చేయాలని నినాదాలు చేసి, బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొత్త వెంకటశివరావు తదితరులు పాల్గొన్నారు.



కరెంటు బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తాడేపల్లి కొత్తూరు సీపీఎం శాఖ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు విద్యుయ్ బిల్లులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసకుమారి, శివరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, యోహాను, సుబ్బారావు, దశరథ రామిరెడ్డి, గోపాలరెడ్డి, శివమ్మ, పద్మావతి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో

అధిక దిగుబడులు

పెదనందిపాడు, డిసెంబరు, 17 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా పీడీ రాజకుమారి అన్నారు. మండల పరిధిలోని కొప్పర్రులో మిర్చి పైరులో కంపోస్ట్ బ్లాక్ మోడల్‌లో ప్రకృతి వ్యవసాయం పద్ధతిపై మంగళవారం రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసే ముందు నవధాన్యాల పంట సాగుచేయడం ద్వారా భూమి ఎంతో సారవంతంగా మారుతుందని, దీని వలన చీడపీడలను నివారించవచ్చునన్నారు. దిగుబడులు అధికంగా సాధించవచ్చునని తెలిపారు. గ్రామంలో 20 మంది రైతులను ఎంపిక చేసి వారికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణనివ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఏలు లక్ష్మీ, సుమ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై వినతి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ మున్సిపల్ తాడేపల్లి జోనల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలువురు ఎంటీఎంసీ అధికారులకు వినతిపత్రం అందించారు. తాడేపల్లి కొండ చుట్టూ ప్రాంతంలో ఉన్న పేదల ఇళ్లను రెగ్యులరైజ్ చేసి వారికి పట్టాలివ్వాలన్నారు. రైల్వే, పిడబ్ల్యూడి, కొండపోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు అందించాలని కోరారు. కృష్ణానది వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించాలన్నారు. పుష్కరబాధితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు రిజ్వాన్, ఆర్ఐ వేదాంతరావు, ఇన్నయ్యలకు సీపీఎం నేతలు బూరగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్, మేరి, బాష, శ్రీనివాసరావు, వినతిపత్రాలు అందించారు. కాగా టిడిపి నేతలు కేళి వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, దారా దాసు, నిర్మల పాల్గొన్నారు.

తాడేపల్లిలో చైన్ స్నాచింగ్

తాడేపల్లి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలో,మండలంలోని అరవింద హైస్కూల్ వద్ద చైన్ స్నాచర్లు మహిళల మెడలోని గొలుసులు తెంచుకుని పారిపోయారు. మంగళవారం తాడేపల్లి పట్టణంలోని కొత్తూరు ఆంజనేయస్వామి గుడి సమీపంలో స్థానికంగా ఉంటున్న దొంతిరెడ్డి సుగణ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా నల్లటి పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు అగంతకులు సుగణ మెడలోని సుమారు రూ.2లక్షలు విలువ చేసే గొలుసును తెంచుకుని పారిపోయారు. బైక్ నడిపే వ్యక్తి హెల్మెట్ ధరించగా, వెనుక కూర్చున్న వ్యక్తి ముఖం కనపడకుండా గుడ్డ కట్టుకున్నాడు. ఇదే తరహాలో అరవింద హైస్కూల్ సమీపంలో చైన్ స్నాచింగ్ జరగ్గా రెండు ఘటనలు ఒక్కరేచేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణి అనుమానాస్పద మృతి

● మృతురాలి తండ్రి ఫిర్యాదుతో భర్తపై కేసు

తుళ్లూరు, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి) ఆరు నెలల క్రింతం ప్రేమ వివాహం చేసుకున్న యువతి మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన పలకలూరుకు చెందిన శ్రీవాణి, తుళ్లూరు మండలం పెదపరిమికి చెంది కావూరి వరప్రసాద్‌లు ప్రేమ వివాహం చేసుకున్నారు. వారు పెదపరిమిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం తెల్లవారు జామున 5 గంటలకు శ్రీవాణి తనకు కడుపులో గ్యాస్‌పట్టేసి ఇబ్బందిగా ఉందని చెప్పటంతో 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాగా ఆమె మూడు నెలల గర్భిణి అని బంధువులు తెలిపారు. తన కుమార్తె మృతి అనుమానస్పదంగా ఉందని, భర్త వరప్రసాదుపై తమకు సందేహంగా ఉందని మృతురాలి తండ్రి పాముల రంగస్వామి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాబు రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఇనాం భూముల సమస్యలు పరిష్కరించండి

● హరిశ్చంద్రపురం రెవెన్యూ సదస్సులో 60 అర్జీలు

తుళ్లూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) ఇనాం భూముల సమస్యలను పరిష్కరించాలని మండల పరిధిలోని హరిశ్చంద్రపురం గ్రామంలో మంగళవారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు కోరారు. అందుకు సంభందించిన 60 అర్జీలను వీఆర్వో, ఎండోమెంట్ అధికారులకు అందజేశారు. పట్టాదారుపాసు పుస్తకాలుండి రికార్డులన్నీ తమ పేరు మీద ఉన్నాకాని పూర్తి హక్కులు లేకుండా చుక్కల భూమిగా చూపించారని, దానిని సరిచేసి రైతులకు హక్కు కల్పించాలని కోరారు. సర్వే సమస్యలున్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొమ్మినేని కోటేశ్వరావు, సీనియర్ నేత కొమ్మినేని సత్యనారాయణ, బుడ్డి సాంబశివరావు, రైతులు దాసర రంగారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు

● వ్యవసాయ కమిషనర్ కార్యాలయ డీడీ డి వెంకటేశ్వర్లు

పెదనందిపాడు, డిసెంబరు, 17 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న, శెనగ పైరులో పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ కమిషనర్ కార్యాలయ డీడీ డి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. శెనగపైరులో శెనగపచ్చ, లద్దెపురుగు ఉధృతంగా ఉందని దీని నివారణకు ఎమామిస్టెన్ బెంజాక్ ఎకరాకు 90గ్రా.లు పిచికారీ చేయాలని, 40 నుంచి 60 రోజుల పైరులో కుంకుమతెగులు ఆశించేప్రమాదం ఉందని దీనినివారణకు ప్రోపినోజోల్ లేదా మ్యాంకోజెబ్ 400 గ్రా.లు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త డా.వెంకటనాగలక్ష్మీ, ఏవో సుధారాణి, వీఏఏ పవన్‌కుమార్, పశువైద్యాధికారి స్వాతివిమల పాల్గొన్నారు.

గ్రామాల్లో సుస్థిర పాలనే లక్ష్యంగా కృషి

● డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్ పద్మరాణి

వట్టిచెరుకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సిద్ధం చేసుకోవాలని డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్ పద్మరాణి ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. మండల కేంద్రం వట్టిచెరుకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆడిటోరియంలో గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం రెండవ బ్యాచ్ పాల్గొన్న సర్పంచ్‌లు, మండల, గ్రామ సచివాలయ అధికారులు వీఆర్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్ పద్మరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్యక్రమాలను నిబద్ధతతో పని చేసి లక్ష్యాలను సాధించు కోవటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. గ్రామాల అభివృద్ధికి తొలి దశగా ప్రతి ఒక్కరు ప్రజా ప్రతినిధులు ప్రజలను భాగస్వాములను చేయటంద్వారా పక్కా సమాచారాన్ని సేకరించి ప్రణాళికలను రూపొందించు కోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ, డీఆర్‌పీ కే అనురాధ, ఎంపీడీవో ఎం రమేష్ బాబు, ఈవోపీఆర్‌డీ వీ జ్యోతి, ఎంవోఆర్‌పీ కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

● ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీడీ ఉమాదేవి

పెదనందిపాడు, డిసెంబరు, 17 (ఆంధ్రజ్యోతి) : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీడీ ఉమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు మంగళవారం కిశోర వికాసంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలను పనులకు పంపకుండా, బడికి పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల్లో, కారాగారాల్లో బాలకార్మికులచే పనులు చేయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లు తెలిస్తే గ్రామకమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వాలని, దీని వలన కలిగే అనర్థాలను వారికి వివరించాలన్నారు. అనంతరం కార్యాలయం ఎదుట మానవహారం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరావు, జాకబ్, సీహెచ్‌వో ప్రసాదస్వామి, ఏపీఎం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుకు అధిక ప్రాధాన్యం

● రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు

వట్టిచెరుకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ వ్యవసాయానికి రాను రాను ప్రాధాన్యత పెరుగుతున్నదని, అందుకు అనుగుణంగా సేంద్రీయ వ్యవసాయ సాగును ప్రోత్సహించే విధంగా రైతుల్లో చైతన్యం తెచ్చేందుకు రైతు నేస్తం నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని రైతు నేస్తం ఫౌండేషన్‌ను మంగళవారం కమిషనర్ ఢిల్లీరావు సందర్శించారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల ముడి సరుకును ప్రజలు వినియోగించే విధంగా తయారు చేసే యంత్రాలను పరిశీలించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. సేంద్రీయ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం పెరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వమూ ఆవైపుగా ప్రోత్సహిస్తోందని అన్నారు. అలాగే రైతు నేస్తం ఫౌండేషన్ వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల పంటలకు సేంద్రీయ ఎరువులతో తీసుకుంటున్న విధానాన్ని పరిశీలించారు. కమిషనర్ ఢిల్లీరావు వెంట వ్యవసాయ కమిషనర్ కార్యాలయ డీడీఏ బాలు నాయక్, మండల ఏవో కే లక్ష్మి, రైతు నేస్తం ఫౌండేషన్ కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సుల్లో

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

ఫిరంగిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు సత్వరపరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జే.ప్రసాదరావు అన్నారు. మంగళవారం బేతపూడి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామ రెవెన్యూ పరిధిలో అడంగల్, పట్టా దారు పాసు పుస్తకం, భూమి కొలతలు లాంటి సమస్యల అర్జీలను రైతులు ఇవ్వాలని, వాటిని ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో జే శ్రీనివాసరావు, రిజిస్ట్రేషన్ శాఖ కేపీ షేక్ ఫరీదు బాషా, సర్వేయర్ పీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ షేక్ అబ్దుల్ రెహ్మన్, వీఆర్‌వో వీ శివ నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యం

● రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గుంటూరు (విద్య), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతు సాధికారసంస్థ ప్రధానంగా రాష్ట్రంలోని రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, జీవనోపాధి మెరుగుదలకు కృషిచేయడమే లక్ష్యమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఏపీ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ కో ఆపరేషన్ అడ్వైజర్, మాజీ ఐఏఎస్ టీ.విజయ్‌కుమార్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ సైన్సెస్, అపారి (ఆసియా పసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్), యూరోపియన్ ప్లాంట్ హెల్త్ రీసెర్చ్ అండ్ కోఆర్డినేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా.. రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్టనర్‌షిప్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే ఇంటర్నేషనల్ సదస్సును మంగళవారం ప్రారంభించారు. మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు ఆర్థిక, సాంకేతిక సహాయం, ఉచిత సలహాలు, మార్గదర్శకాలు అందిస్తామన్నారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం సబ్సిడీలు అందించడం, పంటల బీమా పథకాలను అమలు చేయడం, పంటల డైవర్సిఫికేషన్, రైతులను వివిధ రకాల పంటలు సాగుచేసుకునేలా ప్రోత్సహించడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు.బ్యాంకాక్‌లోని అపారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి నుంచి వినియోగం వరకు వ్యవసాయ, ఆహార వ్యవస్థలో ఆధునిక పద్ధతులను అనుసరించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో యూరోపియన్ ఫైటోశానిటరీ రీసెర్చ్ కోఆర్డినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ బల్డిస్సెర జీవాని, డాక్టర్ కేఎస్ వరప్రసాద్, డాక్టర్ పాల్ డబ్ల్యూజే టేలర్, డాక్టర్ వినోద్ పండిట్, డాక్టర్ లావు రత్తయ్య, పీ.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస వ్రతమహోత్సవాలు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాస వ్రత మహోత్సావాలను రెండో రోజు వైభవంగా నిర్వహించారు. మంగళవారం బాలస్వామి అమ్మవారికి తిరుప్పావై సేవా, శ్రీకృష్ణ, గోదా అష్టోత్తర అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, గోపు రామకృష్ణ, లోకనాథం, ముద్దాభక్తుని రమణయ్య, అనూష, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



వీవీఐటీలో పుస్తకాలు పరిశీలిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజు

వీవీఐటీని సందర్శించిన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి

పెదకాకాని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు వీవీఐటీ కళాశాలను మంగళవారం సందర్శించారు. గుంటూరు విజ్ఞాన మందిరంలో విజయనగరం మహారాజు డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి వేడుకల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వీవీఐటీ వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఏఎన్‌యూ విద్యార్థులు

పెదకాకాని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 2025 జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడుకు ఎంపిక అయ్యారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ వి.దివ్య తేజోమూర్తి తెలిపారు. ఈ మేరకు ఎంపికైన వలంటీర్లను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర రావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు అభినందించారు. ఈ పరేడ్‌కు రాష్ట్రవ్యాప్తంగా పదిమంది విద్యార్థులు ఎంపిక కాగా నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. వర్సిటీలోని ఆర్కిటెక్చర్ కళాశాల నుంచి ఎం.శిరీష, హిందూ కళాశాల నుంచి సీహెచ్ రుత్విక్ బాబు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంలో వారిని ఇన్‌చార్జి వీసీ, ఇతర అధ్యాపకులు అభినందించారు.

డాక్టర్ సాంబశివుడుకు బెస్ట్ ఫ్యాకల్టీ పేపర్ అవార్డు

తెనాలి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వైద్యుడు సాంబశివుడు బెస్ట్ ఫ్యాకల్టీ పేపర్ అవార్డు అందుకున్నారు. ఆగ్రాలో ఈ నెల 11 నుంచి 14 వరకు జరిగిన 84వ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన సమర్పించిన స్టడీ ఆఫ్ డయాబెటిస్ లోయర్ లింబ్ ఇన్‌ఫెక్షన్ అనే అంశానికి గాను ఆయనకు ఈ అవార్డు లభించింది. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, కార్యదర్శి ప్రతాప్ సిన్హా నుంచి అవార్డు అందుకున్న ఆయనను పలువురు వైద్యులు అభినందించారు.

పేదలకు సాయం చేయడమే నిజమైన క్రిస్మస్: దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదవారికి సాయం చేయడమే నిజమైన క్రిస్మస్ అని పెన్నీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా చెప్పారు. పెదరావూరు సంస్థలో మంగళవారం వితంతువులకు దుస్తులు, సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రీస్తు బోధనలను మానవాళి ఆచరించాలన్నారు. ప్రదీప్, నరేష్, మణి తదితరులు పాల్గొన్నారు.



అబాకస్ పోటీలలో తృతీయ స్థానం సాధించిన భాస్కర్ శ్రీ వెంకటేశ్వర్

అబాకస్ పోటీలలో పొన్నూరు బాలుడి ప్రతిభ

పొన్నూరు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అబాకస్ పోటీలలో పొన్నూరు పట్టణానికి చెందిన 8 ఏళ్ల బాలుడు భాస్కర్ శ్రీవెంకటేశ్వర్ అద్భుత ప్రతిభను చూపి తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాడు. పట్టణంలోని వేద పబ్లిక్ స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న భాస్కర్ శ్రీ వెంకటేశ్వర్ యూవీమాస్ అబాకస్ పాఠశాలలో శిక్షణ పొందాడు. ఈ నెల 14, 15 తేదీలలో ఢిల్లీ యూనివర్శిటీలో జరిగిన అంతర్జాతీయ అబాకస్ అండ్ మెంటల్ క్యాలిక్యులేషన్ పోటీలలో పాల్గొన్నాడు. భాస్కర్ శ్రీవెంకటేశ్వర్ 85 దేశాలకు చెందిన చిన్నారులతో పోటీపడి ఏ2 కేటగిరిలో తృతీయ స్థానం సాధించాడు. బాలుడికి అంతర్జాతీయ స్థాయిలో బహుమతి లభించటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



పొన్నూరు టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం, సలహాల కోసం బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టి అజిత కుమారి మంగళవారం తెలిపారు. సలహాలు, సూచనలపై 9959225267 నంబరుకు ఫోన్ చేయాలని డిపో మేనేజర్ కోరారు.

రోడ్ల విస్తరణ పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలి

- బోసురోడ్డులో నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి మనోహర్
- వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలువకుండా చేయాలి
- పనుల్లో డొల్లతనం సహించేదిలేదు
- జనవరి నుంచి వార్డులలో పాదయాత్ర
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రూ.40లక్షలతో స్థానిక బోసు రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను గమనించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల విస్తరణ పనులను పరిశీలిస్తుండగా పలు ప్రాంతాలలో ఆక్రమణలకు గురవుతున్న తీరును గమనించి అధికారులను నిలదీశారు. అభివృద్ధి పనుల్లో రూ.లక్షలు ఖర్చు చేస్తుంటే వాటిని సద్వినియోగం చేసేలా అధికారులు బాధ్యత తీసుకోవాల్సిందిపోయి ఇలా నిర్లక్ష్యంగా ఆక్రమణలకు గురవుతుంటే ఉపేక్షించడం ఏమిటంటూ మండిపడ్డారు. మున్సిపల్ ఏఈ సూరిబాబును పిలిచి నిత్యం పనులను పరిశీలిస్తున్నావా, రోడ్డును ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి ఎత్తుగా రోడ్డు పోస్తుంటే ఏంచేస్తున్నావంటూ ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నవారిపై చర్యలు చేపట్టాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మలను ఆదేశించారు. అనంతరం మీడియాతో నాదెండ్ల మాట్లాడుతూ పట్టణంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు చేపట్టలేదని దీంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక పట్టణాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా చిన్నపాటి వర్షం కురిస్తే జలాశయాలు తలపించే బోసురోడ్డుకు ఆ సమస్య నుంచి శాశ్వత పరిష్కారమయ్యేలా రోడ్డు విస్తరణ పనులను చేపట్టామన్నారు. దీంతో వర్షపునీరు నేరుగా డ్రెయిన్‌లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా పారిశుధ్య నిర్వహణ విషయాలలో కూడా అధికారులను అప్రమత్తం చేశామని సత్ఫలితాలు వస్తున్నాయని ఆయన చెప్పారు. విస్తరణ పనులకు ప్రజలు కూడా సహకరిస్తూ త్వరితగతిన పూర్తిచేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని మనోహర్ వివరించారు. రానున్న జనవరి నుంచి పాదయాత్ర ద్వారా పట్టణంలో అన్ని వార్డులలో పర్యటనలు చేపడతానని తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఇన్‌చార్జ్ ఎంఈ శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, ఓఎస్‌డీ ఏసురత్నం, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్క్ అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

తెనాలి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చినరావూరు పార్క్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం చినరావూరు పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి మనోహర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, పలువురు కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

తెనాలి రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తూ ఖరీదైన వైద్యాన్ని సైతం వారికి చేరువచేసేలా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తూ వారికి భరోసాగా నిలుస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి మనోహర్ తెనాలి నియోజకవర్గంలోని పలువురు బాధిత కుటుంబసభ్యులకు సుమారు రూ.7,82,026 చెక్కులను అందించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకుంటున్న లబ్ధిదారులతో మంత్రి మనోహర్

రైతులకు అండగా నిలవాలి

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



డీసీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఏడుకొండలను అభినందిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల పరిధిలో చివలూరు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా, వేమూరు డీసీ ఉపాధ్యక్షుడిగా తోట ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మంగళవారం మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు ఈ సందర్భంగా వారికి దుశ్శాలువాలను కప్పి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ సాగునీటి విషయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. మనోహర్‌ను కలిసిన వారిలో నాయకులు అడపాల నాగేశ్వరరావు, యర్రు వెంకయ్య నాయుడు, అమ్మిశెట్టి హరికృష్ణ, దివ్వెల మధుబాబు తదితరులు ఉన్నారు.

రైతులకు సకాలంలో సాగునీరందేలా చూడండి: మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు సకాలంలో సాగునీరందేలా బాధ్యతగా మెలుగుతూ అన్నదాతలకు అండగా నిలవాలని మాజీ మంత్రి, గుంటూరు, కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం నిర్వహించిన నీటి సంఘాల డీసీ ఎన్నికల్లో తెనాలికి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా గెలుపొందిన పెమ్మసాని శ్రీనివాసరావు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలపాటి ఆయనను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

నీటి సంఘాల డీసీ ఏకగ్రీవం



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఏకగ్రీవమయ్యాయి. మంగళవారం పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలకు సన్నాహాలు చేశారు. ఐతే సభ్యులందరూ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ప్రశాంతంగా ముగిశాయి. కొలకలూరుకు అధ్యక్షుడిగా జొన్నల మురళీకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా తాడిబోయిన నాగేశ్వరరావు, తెనాలికి అధ్యక్షుడిగా పెమ్మసాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా యలవర్తి రఘుబాబు ఏకగ్రీవంగా గెలుపొందారు. వీరిని పట్టణ, మండల టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా డీసీ ఎన్నికలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు జరిగాయి. డీఆర్‌డీఏ పీడీటీ విజయలక్ష్మి పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. 45వ డీసీ అధ్యక్షుడిగా వడ్లమూడికి చెందిన దేవరపల్లి పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దండమూడికి చెందిన బలగాని రామారావు, ఎన్నికయ్యారు. 46వ డీసీకి వెల్లలూరుకు చెందిన గణిపిశెట్టి రామకృష్ణ అధ్యక్షుడిగా, మన్నవకు చెందిన అన్నవరపు హనుమాయమ్మ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 49వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ కాకుమాను మండలం గరికపాడుకు చెందిన నువ్వుల సునీల్ చౌదరి, వైస్ ఛైర్మన్‌గా వట్టిచెరుకూరుకు చెందిన కల్లూరి తిరుపతిరావు ఎన్నికయ్యారు. నూతన డిస్ట్రిబ్యూటరీ కమిటీ కార్యవర్గ సభ్యులను కూటమి పార్టీల నాయకులు, సాగునీటి శాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

రెవెన్యూ గ్రామ సభలతో రైతుల భూ సమస్యల పరిష్కారం

● స్పెషల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్


తెనాలి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలతో ఎన్నో ఏళ్ల నుంచి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారమవ్వనున్నాయని స్పెషల్ ఆఫీసర్ ఏడీ హ్యాండ్లూమ్స్ బి.ఉదయ్‌కుమార్ చెప్పారు. మండలంలోని మల్లెపాడులో మంగళవారం స్పెషల్ ఆఫీసర్ ఉదయ్ కుమార్, డీటీ ప్రసాద్‌ల పర్యవేక్షణలో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతుల నుంచి 16 అర్జీలు అందాయి. వాటిల్లో 8 సర్వేకి రాగా 1 మ్యుటేషన్, మిగిలిన 7 ఇతర సమస్యలతో వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గ్రామ సర్పంచ్ పి.భారతీదేవి, ఎండోమెంట్ డిపార్టుమెంట్ అధికారి హరిప్రసాద్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాల రాజేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిడపర్రులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రికార్డులను పరిశీలించారు. పిడపర్రు రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఐదు దరఖాస్తులు వచ్చాయని వాటిని విచారణచేసి త్వరలో పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఈవో పద్మావతి, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూపూడి రెవెన్యూ సదస్సుకు 22 అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జూపూడిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 22 అర్జీలు దాఖలైనట్లు డిప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్‌మోహన్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో మ్యుటేషన్ కోసం 11 అర్జీలు, పాస్ పుస్తకాల కోసం 2 అర్జీలు, 3 అడంగల్ మార్పుల కోసం, 4 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం 1, 22ఏ మార్పు కోసం ఒకటి దరఖాస్తులు అందాయి. ఈ సదస్సులో రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరావు శర్మకు టీడీపీ నేతల నివాళి



సుబ్బరాయ శర్మకు నివాళి అర్పిస్తున్న ధూళిపాళ్ల వైదీప్తి తదితరులు

పొన్నూరు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లబరావుపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఐటీడీపీ కో ఆర్డినేటర్ కోన అనురూప్‌సాయి తండ్రి కోన సుబ్బారాయశర్మ మంగళవారం మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాలతో ఆయన కుమార్తె ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి మంగళవారం వల్లభరావుపాలెం గ్రామంలోని సుబ్బారాయ శర్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. మృతుడికి నివాళులు అర్పించిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, అరెమండ విజయ్ కుమార్, చిలకా రవి టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మదమంచి వీరయ్య చౌదరి, వేజెండ్ల ఏకాంబరేశ్వరరావు, బోడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సలహాతో మందులు వాడుకోవాలి: మండల వైద్యాధికారి అనురుధ్

కొల్లిపర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహాల మేరకు మందులను వాడుకోవాలని మండల వైద్యాధికారి అనురుద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దావులూరిపాలెంలో వైద్యాధికారులు ఫామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

రైతులు పంటల బీమా పథకంలో చేరాలి: ఏడీఏ

పొన్నూరు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రబీలో పంటల సాగుచేసే రైతులు ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకంలో చేరాలని ఏడీఏ వీ రామకోటేశ్వరి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొండముది, వడ్డిముక్కల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రబీలో సాగుచేసే జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి డేగల వెంకట్రామయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యం

● రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్



సభలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ ప్రధానంగా రాష్ట్రంలోని రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, జీవనోపాధి మెరుగుదలకు కృషి చేయడమే లక్ష్యమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, ఏపీ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ కో ఆపరేషన్ అడ్వైజర్, మాజీ ఐఏఎస్ టీ విజయ్‌కుమార్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ సైన్సెస్, అపారి (ఆసియా పసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్), యూరోపియన్ ప్లాంట్ హెల్త్ రీసెర్చ్ అండ్ కోఆర్డినేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా.. రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్టనర్‌షిప్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే ఇంటర్నేషనల్ సదస్సును మంగళవారం ఘనంగా ప్రారంభించారు. మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు ఆర్థిక, సాంకేతిక సహాయం, ఉచిత సలహాలు, మార్గదర్శకాలు అందిస్తామన్నారు. బ్యాంకాక్‌లోని అపారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి నుంచి వినియోగం వరకు వ్యవసాయ, ఆహార వ్యవస్థలో ఆధునిక పద్ధతులను అనుసరించడం అవసరమన్నారు. కార్యక్రమంలో యూరోపియన్ ఫైటోశానిటరీ రీసెర్చ్ కోఆర్డినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ బల్డిస్సెర జీవాని, హైదరాబాద్‌లోని ఐకార్ ఐఐవోఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్, అపారి టెక్నికల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పాల్ డబ్ల్యూజే టేలర్, సౌత్ ఆసియా కాబి ఇంటర్నేషనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: కొలసాని

తెనాలి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎవిఎన్ కళాశాల ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ చెప్పారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల వద్ద మొక్కలు పంపిణీ చేశారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను ఏబీవీపీ నిర్వహించడం అభినందనీయమన్నారు. పాటిబండ్ల శ్రీనివాసరావు, తిరుపతిరావు, కె.శ్రీనివాసరావు, ప్రసాద్, వేదశ్రీ, హనుమత్ ప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, మైలా హరి, శేషు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తను పూర్తిగా తొలగించండి: మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్లపై చెత్తను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పారిశుధ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం పట్టణంలోని 7, 19, 36వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం 4వ డివిజన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల మస్టర్ రికార్డులను పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

అభివృద్ధి దిశగా ప్రణాళికలను సిద్ధం చేయాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈవోపీఆర్‌డీ భార్గవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పలు అంశాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసమే పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు

● ఎంపీడీవో విజయలక్ష్మి



ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ క్యాంపలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం, కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్లను ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ హైస్కూల్స్‌లో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్‌ను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సెంటర్లలో ఆధార్‌లో ఏ విధమైన తప్పులు ఉన్నా, అడ్రస్సు మారినా సరిచేయించుకోవాలన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో హైస్కూల్స్‌లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్లను సత్కరిస్తున్న ఎస్‌టీవో శ్రీనివాసరావు తదితరులు

పెన్షనర్ల సేవలు సమాజానికి అవసరం: ఎస్‌టీవో

పొన్నూరు టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ విభాగాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన వారి సేవలు సమాజానికి అవసరమని ఎస్‌టీవో ఎ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో మంగళవారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిధిగా హాజరై ఎస్‌టీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ప్రభుత్వ శాఖలలో పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ తరువాత కూడా తమ సేవలను సమాజానికి అందించాలన్నారు. ఉపాధ్యాయులుగా పనిచేసిన వారు ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. పలు ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు వారి పరిధిలోని అవసరమైన సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో 75ఏళ్లు నిండిన పెన్షనర్లకు ఘనంగా సన్మానం నిర్వహించారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి ప్రభుదాస్, జిల్లా అధ్యక్షుడు కె నరసింహా రెడ్డి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పి మురళీకృష్ణ, పొన్నూరు శాఖ నాయకులు ఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొప్పాక సత్యం తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్ : పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశరావు నివేదిక సమర్పించారు. ఉదయరాజు, జమ ఖర్చులను పెన్షనర్లకు వివరించారు.

● ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో మంగళవారం పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించారు. ఆర్టీసీ, ఏపీఆర్ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 43 ఏళ్ల క్రితం పెన్షన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును జిల్లా అధ్యక్షుడు శివశంకర్ వివరించారు. సీపీఎస్ ప్రవేశ పెట్టి కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును నీరుగార్చిందన్నారు. ఆదినారాయణ, ప్రసాద్, భారతి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యం: ఎంపీడీవో

చేబ్రోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు ప్రణాళికలతో ముందుకు సాగాలని ఎంపీడీవో కొప్పాక లలిత అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామాల సుస్థిరాభివృద్ధికి లక్ష్యాలపై శిక్షణ తరగతులు జరిగాయి. గ్రామీణ అభివృద్ధి సంస్థ పంచాయతీరాజ్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతుల్లో మండల స్థాయి అధికారులకు మండల ప్రజా ప్రతినిధులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంపీపీ కొక్కిలిగడ్డ సాహితి, ఈవోపీఆర్‌డీ టి ఉషారాణి, పంచాయతీరాజ్ డీఈ ఎంఎంఎస్ ప్రసాద్, స్వచ్ఛభారత్ మిషన్ కో ఆర్డినేటర్ జి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.